Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930

Longest Living Newspaper in Telugu Journalism

జమీన్‌రైతు

సంపుటి: 80 • సంచిక: 46 • 30-10-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

షైన్
సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల
డా॥ SK. మహమ్మద్ అలి
ఫోన్: 0861 - 2340032

లేజర్ చికిత్స
Professor, Endodontics
కేర్
సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
ఫోన్: 2303300

జగన్‌లో చిగురంత ఆశ

ఢిల్లీ పర్యటన తర్వాత ముఖ్యమంత్రిత్వం మీద ఆరాటం వదలుకొని, రోశయ్యకు మద్దతు పలికిన వైఎస్.జగన్‌లో ఇంకా చిగురంత ఆశ మిగిలే వుందని తెలుస్తున్నది. సాంప్రదాయం ప్రకారం జరపవల్సిన సిఎల్పీ సమావేశంలో తన బలాన్ని ప్రదర్శించ గలిగితే సోనియా పునరాలోచన చేయవచ్చునని భావిస్తున్నాడు. గత రెండు రోజులుగా తనను కలవడానికి వస్తున్న సన్నిహితులతో సూచన ప్రాయంగా ఈ అభిప్రాయం బయటపెడుతున్నాడు. సిఎల్పీ సమావేశానికి కేంద్రం నుంచి పరిశీలకులను పంపడం కాంగ్రెస్ సాంప్రదాయం. ఆ పరిశీలకుల చేత ఎమ్మెల్యేల వ్యక్తిగత అభిప్రాయాలు సేకరించేట్లు ఒప్పించాలని; మెజార్టీ శాసనసభ్యులు తన పేరే చెప్తారు కాబట్టి, రాష్ట్రంలో తన బలం ఎంతో వారికి అర్థమౌతుందని జగన్ వ్యూహం రచిస్తున్నాడు. 1991లో నేదురుమల్లి జనార్దనరెడ్డి ముఖ్యమంత్రి అయినప్పుడు, కేంద్ర పరిశీలకులు ఎమ్మెల్యేల నుంచి వ్యక్తిగత అభిప్రాయాలు సేకరించారు. మెజార్టీ జనార్దనరెడ్డి పక్షం వున్నట్లు తేలిపోవడంతో, అధిష్ఠానం నిర్ణయంతో ప్రమేయం లేకుండా, వారికి వారే నేదురుమల్లిని సిఎల్పీ నాయకుడిగా ప్రకటించారు. ఇప్పుడు కూడా ఆ పద్ధతి పాటించమని కోరడం జగన్ ఆంతర్యం. అయితే అందుకు సోనియాగాంధీ సమ్మతిస్తుందా అన్నది ప్రశ్న.


• పివిని తలపిస్తున్న రోశయ్య

ఒప్పించడం తప్ప నొప్పించే యోచనలేదు!



రోశయ్య ముఖ్యమంత్రిత్వానికి లాంచనప్రాయంగా, సాంప్రదాయ పరంగా అధికార ముద్ర వేయడానికి 5తేది సిఎల్పీ సమావేశం జరపవచ్చని ఎఐసిసి వర్గాల భోగట్టా. 3తేది ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లి సోనియా గాంధీని కలుస్తారని; 5తేది సాయంత్రం కేంద్రం నుంచి వచ్చే పరిశీలకుల సమక్షంలో సిఎల్పీ సమావేశం జరుపుతారని; అందులో వైఎస్.జగన్ చేతనే రోశయ్య పేరు ప్రతిపాదిస్తారని చెప్తున్నారు. సిఎల్పీ సమావేశం ముగిసిన వెంటనే మంత్రివర్గ విస్తరణ కూడా చేపట్టాలని మొదట భావించారు. అయితే ఇంతలో గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రకటన వెలువడడంతో, ఆ తంతు ముగిసేవరకు మంత్రివర్గ మార్పు చేర్పులు వాయిదా వేయక తప్పడం లేదని చెప్తున్నారు.

ముఖ్యమంత్రి సైతం సిఎల్పీ సమావేశం కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నాడు. తాను పూర్తికాలం ముఖ్యమంత్రిగా కొనసాగడం ఖాయమని అధిష్ఠానం ఇప్పటికే తేల్చి చెప్పినా, సిఎల్పీ తంతు ముగిస్తే తప్ప తనకు ప్రభుత్వం మీద పూర్తిస్థాయి పట్టు లభించదని ఆయన భావన. ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ తాను ముఖ్యమంత్రి రేస్ నుంచి విరమించుకొన్నట్లు స్వయంగా ప్రకటించడం, దానితో ఆయన వీర విధేయులు తమ మాటల జోరు తగ్గించుకోవడం జరిగింది. అయితే సిఎల్పీ సమావేశంలో గందరగోళం సృష్టించే ఆలోచన వారిలో ఇప్పటికీ వుందని రోశయ్య శిబిరం అనుమానిస్తున్నది. అందువల్ల ఆ సమావేశం తంతు ముగిసేవరకు ఆచితూచి వ్యవహరించక తప్పదని తలపోస్తున్నారు. తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి రెండు నెలలు గడిచిపోతున్నా ఇప్పటికీ జగన్ అనుకూలురైన మంత్రులు, ఎమ్మెల్యేలు అంటీ ముట్టనట్లు వ్యవహరించడం, సహాయ నిరాకరణ పాటించడం రోశయ్యను కలత పెడుతున్నది. సోనియాగాంధీ మాట కూడా లెక్క చేయకుండా వారు చేస్తున్న అల్లరి ఆయన్ను చీకాకు పెడుతున్నది. ఇటువంటి శక్తుల తోక కత్తిరించడం క్షణంలో పని. కానీ దానివల్ల తలెత్తే రాజకీయ పరిణామాలు ఎట్లా వుంటాయో వూహించలేము. తొందరపడి పార్టీ లోపల గలభాలు, గందరగోళాలు కొనితెచ్చుకోవడం కంటే, జగన్ వర్గం ఆందోళన సంపూర్ణంగా అణిగిపోయే వరకు వేచి వుండడమే సరైన రాజకీయ నిర్ణయం అవుతుందని రోశయ్య భావిస్తున్నాడు. అందువల్లనే ఆయన తన వైపు నుంచి జగన్ శిబిరాన్ని రెచ్చగొట్టే పని ఏదీ చేయడం లేదు. జగన్ అనుకూల మంత్రులు తనను వెటకారం చేస్తూ మాట్లాడే మాటలను వినీ విననట్లు వుండి పోతున్నాడు. ప్రభుత్వ వ్యవహారాలలో కెవిపితో సలహా సంప్రదింపులు చేస్తూనే వున్నారు. గతంలో వైఎస్ హామీ ఇచ్చాడని కెవిపి చెప్పిన ఫైళ్ల మీద సంతకాలు పెడుతున్నాడు.



సాధ్యమైనంత వరకు జగన్ వర్గంతో సర్దుబాటు ధోరణిలో వెళ్లాలన్నది రోశయ్య ఆంతర్యంగా కన్పడుతున్నది.

అయితే ఆయన శిబిరానికి మాత్రం ఇది ఎంతమాత్రం రుచించడం లేదు. సర్దుబాటు కోసం తగ్గి మాట్లాడే కొద్దీ జగన్ వర్గీయులు రెచ్చిపోతున్నారని, కనీసం ఒకటి రెండు అంశాలలోనైనా ఆయన ముఖ్యమంత్రిగా తన అధికారాన్ని ప్రదర్శించి చూపితే తప్ప వారి దూకుడును నివారించడం సాధ్యం కాదని వీరి భావన. కానీ పివి.నరసింహారావు వలెనే రోశయ్య కూడా ఓర్పు, నేర్పుతో వ్యవహరించాలని భావిస్తున్నారు. బేధ, దండోపాయాల పట్ల ఆసక్తి చూపడం లేదు.

ఇదిట్లా వుంటే, జగన్ పట్ల వీర విధేయత ప్రకటించిన మంత్రులు, ఎమ్మెల్యేలలో అధిక సంఖ్యాకులు మెల్ల మెల్లగా రోశయ్యకు చేరువకావడానికి ప్రయత్నిస్తున్నారు. సునీత లక్ష్మారెడ్డి, రామిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, బొత్స సత్యనారాయణ, దానం నాగేందర్ వంటివారు ముఖ్యమంత్రిని ప్రసన్నం చేసుకొనే పనిలో నిమగ్నమైనట్లు కన్పడుతున్నది. జగన్ కానప్పుడు, రోశయ్య గారే సరైన నాయకుడని వీరు చెప్తున్నారు. ఇదే తీరులో మరి కొంతకాలం ఓర్పుపడితే అందరూ దారికి వస్తారన్నది ముఖ్యమంత్రి ఆలోచన.

రోశయ్య మెతకతనం పట్ల మొదట మొదట చిరాకు ప్రదర్శించిన ఎఐసిసి నాయకత్వం కూడా ఇప్పుడు ఆయన పద్ధతే సరైనదన్న భావనకు వస్తున్నది. కేంద్ర మంత్రులు చిదంబరం, ప్రణబ్ ముఖర్జీలిద్దరూ కొంతకాలం పాటు రోశయ్యకు మార్గదర్శకత్వం వహించారు. రోజుకు పది పన్నెండుసార్లు ఫోన్లోనే మాట్లాడుతూ సలహాలు ఇచ్చారు. మెల్లమెల్లగా ఆ అవసరం తొలగిపోతున్నది. రోశయ్య తనకు తానుగా నిర్ణయాలు తీసుకోవడం, రాష్ట్రంలో గొడవలు, గందరగోళాలు చెలరేగకుండా జాగ్రత్తపడడం, చరిత్రలో ఎప్పుడూ చూడని స్థాయిలో వచ్చిన వరదలను ఎదుర్కోవడంలో ముఖ్యమంత్రి ప్రదర్శించిన నేర్పరితనం కేంద్ర నాయకుల మన్ననలు చూరగొన్నాయి. దానితో వారు ఆయనకు పూర్తి స్వేచ్ఛ కల్పిస్తున్నారు.

కార్టూన్ స్కేప్



తొందరగా రాయండి సార్!
వంటింట్లోకి దీపం కావాలట...!

[మహా కుంభకోణం]

అరవైకోట్ల రూపాయల ముడుపులు తిన్నారన్న బోఫోర్స్ ఆరోపణ, మచ్చలేని నాయకుడిగా కీర్తిగన్న రాజీవ్ గాంధీని మరణానంతరం కూడా వదలకుండా దెయ్యం వలె పట్టి పీడిస్తున్నది. వెయ్యికోట్ల గడ్డి కుంభకోణంతో లాలు ప్రసాద్‌యాదవ్ చరిత్రలో సాటిలేని అవినీతిపరుడిగా గబ్బు పట్టాడు. దత్తకుమారుడి పెళ్లి ఆడంబరంగా చేసిన నేరానికి జయలలిత పెద్ద శిక్షే అనుభవించింది. కానీ ఇప్పుడు కేంద్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ల మంత్రి ఎ.రాజా 60వేల కోట్ల రూపాయల కుంభకోణానికి కారకుడయ్యాడు. మొత్తం ప్రపంచ చరిత్రలోనే ఒకే ఒక అవినీతికర నిర్ణయం ద్వారా దేశానికి ఇంత భారీ మొత్తంలో నష్టం కల్గిన సాదృశ్యం మరొకటి వుంటుందని భావించలేము.

జమీన్‌రైతు

మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ సేవలు వినియోగదారులకు అందించడానికి నిర్దుష్టమైన వాయు తరంగాలు (రేడియో ఫ్రీక్వెన్సీ వేవ్స్) అవసరమౌతాయి. వీటిని స్థూలంగా స్పెక్ట్రం అని పిలుస్తారు. దేశంలోని అన్ని రకాల రేడియో తరంగాల మీద కేంద్ర ప్రభుత్వానికి నియంత్రణ వుంటుంది. ఎవరు ఏ ఫ్రీక్వెన్సీలో ఏ తరంగాలను వాడాలో ప్రభుత్వం నిర్ణయిస్తుంది. దీనిని లైసెన్స్ అని పిలుస్తారు. 2001లో మొదటిసారిగా ఈ స్పెక్ట్రం లైసెన్స్‌లను విక్రయించారు. అప్పట్లో ప్రభుత్వానికి 1500 కోట్ల రూపాయల రాబడి వచ్చింది. ఆ తర్వాత మొబైల్ ఫోన్ల రంగం మనదేశంలో ఎంత అనూహిత స్థాయిలో వృద్ధి చెందిందీ తెలిసిన సంగతే. ప్రస్తుతం దాదాపు 30కోట్ల మంది భారతీయులు మొబైల్ ఫోను వాడుతున్నారు. ఈ సంఖ్య భవిష్యత్తులో రెట్టింపు కావచ్చునని అంచనా. విపరీతంగా పెరిగిన డిమాండ్ వల్ల కొత్త కొత్త కంపెనీలు మొబైల్ ఫోన్ల పరిశ్రమలోకి రావడానికి ఆసక్తి చూపుతున్నాయి. 2008 జనవరి నెలలో కేంద్ర ప్రభుత్వం ఇట్లా ముందుకు వచ్చిన కొత్త కంపెనీలకు స్పెక్ట్రం కేటాయింపులు జరిపింది. అంచనాకు అందని డిమాండ్ వున్న ఈ లైసెన్స్‌లను బహిరంగ వేలం పాట పెట్టి అమ్మడం బదులుగా, ఎవరు ముందు వస్తే వారికి అన్న ప్రాతిపదికన దాదాపు 10 కంపెనీలకు కేవలం 1650 కోట్ల రూపాయలకు కొత్త లైసెన్స్‌లు ఇచ్చేశారు. అయితే ఈ లైసెన్స్ తీసుకొన్న ఏ కంపెనీ కూడా తనంతట తానుగా మొబైల్ ఫోన్లు ప్రారంభించలేదు. ఇటలీ, రష్యా, సౌదీ అరేబియా వంటి విదేశీ సంస్థలకు తమ కంపెనీలలో వాటాలు అమ్మి, సంయుక్త భాగస్వామ్యంతో వ్యాపారం మొదలు పెట్టాయి. కేవలం తమ వద్ద స్పెక్ట్రం కోటా వుందన్న కారణంగా ఒక్కొక్క కంపెనీ 4వేల నుంచి 6వేల కోట్ల రూపాయలకు వాటాలు విక్రయించాయి.

దీని అర్థం, కేంద్రప్రభుత్వంలోని మంత్రులు, అధికారులు, వ్యాపార సంస్థలు కుమ్మక్కై ఒక పథకం ప్రకారం అత్యంత విలువైన స్పెక్ట్రం కేటాయింపులను తమ బొక్కసాలు నింపుకోవడానికి వాడుకొన్నాయని. ఈ అక్రమ లావాదేవీ వల్ల దేశ ఖజానాకు 60వేల కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని అంచనా. అందువల్లనే కేంద్ర విజిలెన్స్ కమిషన్ దీన్ని తీవ్రంగా భావించి సిబిఐ దర్యాప్తుకు ఆదేశించింది. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సిబిఐ అధికారులు టెలికాం అధికారుల కార్యాలయాలలో సోదాలు నిర్వహించారు. ఈ దుర్మార్గ దోపిడీకి ప్రధాన బాధ్యత కమ్యూనికేషన్ల మంత్రి ఎ.రాజాదే అనడంలో సందేహం లేదు. కానీ ఆయన డిఎంకె సభ్యుడు కావడం, డిఎంకె అండతోనే కేంద్రంలో తన ప్రభుత్వం నడుస్తుండడంతో ప్రధాని మన్మోహన్‌సింగ్ కూడా మనసు చంపుకొని రాజా బుద్ధిమంతుడని సమర్థిస్తున్నాడు. అంతర్జాతీయ సమాజంలో జాతి పరువు ప్రతిష్టలను మంటగలిపే ఇంత పెద్ద కుంభకోణాన్ని మసిపూసి మారేడుకాయ చేయ చూడడం మన్మోహన్‌సింగ్ చేయదగిన పనికాదు. ప్రభుత్వ నిర్వహణలో నీతి నిజాయితీల పట్ల ఏ కొంచెం పట్టింపు వున్నా తక్షణం రాజాను ఆ పదవి నుంచి తొలగించి, సమగ్ర దర్యాప్తు జరిపి, దోషులను జైలుకు పంపాలి.

జనవాణి

పల్లె ప్రజలు చేసిన పాపమేమిటి?

పట్టణ ప్రజలతోపాటు పల్లె ప్రజలు కూడా సుఖానికి అలవాటు పడిపోయారు. మిక్సీలు, గ్రైండర్లు, వాషింగ్ మెషిన్లు వాడుతున్నారు. చల్లదనానికి ఎసిలు సైతం కొనిపారేశారు. చిన్నపిల్లలు ఫ్యాన్ ఆగగానే నిద్రలేచి ఏడుపుకు లంఘించుకొంటున్నారు. కాని ట్రాన్స్‌కో అధికారులు మాత్రం పల్లెల్లో ప్రతిరోజూ పదిగంటలకుపైగా విద్యుత్‌కోత విధిస్తూ వట్టిదాల్లో తూతూమంత్రపు కోతను అమలు చేస్తున్నారు. పల్లెల్లో ప్రముఖ నాయకులు, అధికారులు లేకుండా పోవడం వల్ల ట్రాన్స్‌కో అధికారులకు పల్లె ప్రజలంటే లెక్కలేకుండా పోయింది. నెల్లూరు ప్రక్కనే వున్న కోవూరులోనూ పదిగంటలసేపు విద్యుత్‌కోత విధించి జనానికి నరకాన్ని చవిచూపిస్తున్నారు.

టి.కోటేశ్వరరావు, కోవూరు

సెన్సార్‌బోర్డు పనిచేస్తుందా?

ఇటీవల విడుదలవుతున్న చిత్రాల్లోని సన్నివేశాలు, పాటలు, మాటలు వింటుంటే అసలు ఫిలిం సెన్సార్ బోర్డు వుందా అనే అనుమానం కలుగుతుంది. కుటుంబసమేతంగా ఏ సినిమాకు వెళ్లాలో దేనికి వెళ్లకూడదో తెలియజేసే ఎ, యుఎ సర్టిఫికేట్ లోగోలు పోస్టర్లపై కనపడడం లేదు. సినిమాల్లో అసభ్యత రాజ్యమేలుతున్నా సెన్సార్‌బోర్డు అధికారులు, సభ్యులు చూస్తూ ఊరుకోవడం సమంజసం కాదు. సమాజంలో విపరీతపోకడలకు పురికొల్పే సినిమాలను సెన్సార్‌బోర్డు నియంత్రించాలి.

నాగరాజు, నెల్లూరు

ఉత్తరాల బట్వాడా లేదు!

పొగతోట పోస్టాఫీసు ముందున్న పోస్టుబాక్సులో, కస్తూరిదేవి నగర్‌లో వున్న పోస్టు బాక్సులో గత పదిరోజుల్లో పోస్టు చేసిన ఒక్క ఉత్తరం కూడా బట్వాడా కాలేదు. గుంటూరు, కావలి ఇతరచోట్లకు వ్రాసిన ఒక్క ఉత్తరం కూడా చేరలేదు. రోజూ తపాలు పెట్టెల్లో జాబులు తీసుకొని వెళ్లే వుద్యోగి తన బదులుగా మరొక మనిషిని నియమించుకొన్నట్లు, అతను సక్రమంగా ఉత్తరాలు తీసుకొని వెళ్లడం లేదని తెలిసింది. తపాలు పెట్టెల మీద పై రెండుచోట్ల ఎప్పుడు ఏ సమయంలో ఉత్తరాలు తీసుకొని వెళ్తారో సమా

కారవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

3-11-1939
పేజీలు : 16 వెల: అణా

జిల్లాబోర్డు ప్రెసిడెంటు ఎలెక్షన్

నెల్లూరు జిల్లా బోర్డు ప్రెసిడెంటు ఎలక్షన్ 17-11-39తేది ఉదయం 10 గంటలకును వైసు ప్రెసిడెంట్ ఎలక్షన్ సాయంత్రం మూడు గంటలకు జరుగును.

నెల్లూరులో శాంతి పరిస్థితులు

అంగళ్లు పెడ్తున్నారుగాని చాలామంది అస్తమానంతోటే మూసివేస్తున్నారు. సినిమాలు జరుగుచున్నాయి గాని, ప్రేక్షకులు చాలా తక్కువగానున్నారు. అస్తమానమయిన తర్వాత రోడ్లలో రాకపోకలు ఇంకను చాలా తక్కువగానే వున్నవి. ప్రజల్లో భీతి ఇంకను పూర్తిగా తొలగలేదనే ఇందువల్ల చెప్పవాల్సింది. పోలీసువారు రేయింబవళ్లు బస్సులలోను, విడివిడిగను టౌనంతయు కావలా కాస్తున్నారు. ఈవారంలో ఎక్కడా యేలాటి గలాటాలు లేవు. గుంటూరు రిజర్వు పోలీసుదళం యింకను వున్నది.

ప్రెసిడెంటు ఎలెక్షన్

"జిల్లాబోర్డ ప్రెసిడెంటుగా వకీళ్లు పనికిరారు" గోపాలరెడ్డి మంత్రి. వకీలు దశరధరామిరెడ్డి గారు ప్రెసిడెంటుగా వుండరాదనే దానికి నాకొక లా పాయింటు దొరికింది. స్థానిక పాలన మంత్రి గోపాలరెడ్డి గారు చెన్నపురి లా కళాశాల విద్యార్థులకు ఉపన్యసిస్తూ వకీళ్లు జిల్లా బోర్డు ప్రెసిడెంట్లుగా వుండరాదని చెప్పిన భాగాన్ని ఈ క్రింద చదవండి.

20 సంవత్సరాల క్రిందట లాయర్లే దేశంలో అన్ని విషయాల్లో పలుకుబడిగలిగి, నాయకులై వుంటుండేవారు. ఈనాడు 24 జిల్లాబోర్డు అధ్యక్షులలో ఇద్దరు మాత్రమే వకీళ్లు. ఒకప్పుడు బహుశా ప్రతి జిల్లాబోర్డు అధ్యక్షుడూ న్యాయవాదిగా వుండేవాడు. ఇప్పుడు జిల్లాబోర్డు సంఘాధిపత్యం గూడా వకీళ్ల చేతుల్లో లేదు. వకీళ్ల చేతుల్లో నుంచి నాయకత్వం తొలగిపోయింది... 'లా' చదువని జిల్లాబోర్డు ప్రెసిడెంట్లు అనేకమంది దక్కగా పరిపాలన సాగిస్తున్నారు.

50 ఏళ్ల క్రితం ఈవారం

30-10-1959
పేజీలు: 12 వెల: 0-3-0

ఏది సత్యం? ఏదసత్యం

చైనా దురాక్రమణ విషయంలో తాను పార్టీ వైఖరితో విభేదిస్తున్నానన్నారు డాంగే. మాలో విభేదాలున్నాయనే మాట కల్పితమని శలవిచ్చారు నంబూద్రిపాద్. విభేదాలు యదార్థమేనని దృఢపరచారు కార్యదర్శి అజయ ఘోష్. వీటిలో ఏది సత్యమో, ఏది అసత్యమో పాఠకులే నిర్ణయించవలెను.

మొత్తానికి కమ్యూనిస్టుపార్టీ నాయకుల నుండి పరస్పర విరుద్ధ ప్రకటనలు, బహిరంగచర్చలు వస్తున్నవి. ఇది మంచిదే!

'సాధు' గారి ఛాందసం

వచ్చే గాంధీ జయంతి నుండి తెలంగాణాలో మద్యనిషేధం అమలు జరపకుంటే నిరసన వ్రతం పూనుతానంటాడు సర్వోదయ నాయకుడు సాధు సుబ్రహ్మణ్యం.

మద్యనిషేధం అమలులో వున్న ఆంధ్రాజిల్లాలలో, త్రాగుడు ఎక్కువై, అరికట్టే దిక్కులేక కాంగ్రెస్‌కు, ప్రభుత్వానికి గూడా అప్రతిష్టాకరంగా పరిణమించి రద్దు జేయడమే వుత్తమమా అనే పరిస్థితుల్లో, క్రొత్త ప్రాంతంలో ప్రవేశపెట్టమనడం చాందసం గాక మరేమవుతుంది?

అంతకంటే, వున్నచోట సక్రమంగా అమలు జరుపమని ఒత్తిడి తేవడం అవసరం.

నెల్లూరు ముచ్చట్లు

ఏ.సి ఆక్షేపణ

పంచాయతీ సమితులకు సంబంధించి మండల కాంగ్రెస్ నాయకులైన ఏ.సి.సుబ్బారెడ్డి, వంగల్లు కోదండరామరెడ్డి గారల చీలికను ప్రస్తావించి; అది వారికి, జిల్లాకు, కాంగ్రెస్‌కు శ్రేయస్కరం గాదని గతవారం మేము వ్రాసిన దానిని సుబ్బారెడ్డి గారు ఆక్షేపించారు. అయితే తమ మధ్య విభేదాలు పొడచూపి, చీలిక లేర్పడినది యదార్థంగాదని ఖండించ లేదు.

నెల్లూరు ముచ్చట్లు

విదేశీ పర్యటనకు కలెక్టర్

నెల్లూరు కలెక్టర్ రామ్‌గోపాల్ ఇజ్రాయెల్, నెదర్లాండ్ దేశాల పర్యటనకు 27వ తేది బయలుదేరి వెళ్లారు. ఈ నెల 29వతేదీ నుంచి వచ్చేనెల మూడోతేదీ వరకు ఈ రెండు దేశాల్లో వ్యవసాయ అనుబంధిత పరిశ్రమలను ఆయన అధ్యయనం చేస్తారు. జిల్లాలో ఇఫ్‌కో సంస్థ కిసాన్‌సెజ్‌ను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఇఫ్‌కోనే కలెక్టర్‌ను ఈ రెండు దేశాల పర్యటనకు పంపింది.

కలెక్టర్ విదేశీ పర్యటనకు వెళ్లిన దృష్ట్యా జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌గా వ్యవహరిస్తారు.

ఎస్పీ బదలీ?

జిల్లా ఎస్పీ బి.మల్లారెడ్డి బదలీ కావచ్చనే వార్తలు వినవస్తున్నాయి. ఎస్పీగా పదవీ బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తికావడంతోపాటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంత్యక్రియల సందర్భంగా వేంపల్లె జంక్షన్‌లో విధి నిర్వహణలో ఆయన విఫలమయ్యారన్న ఆరోపణల నివేదిక వెరసి ఆయన బదలీ తప్పదంటున్నారు.

ఎసిబికి కొత్త డిఎస్పీ

నెల్లూరు డివిజన్ ఎసిబి డిఎస్పీగా ఎస్.సాయికృష్ణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన విశాఖ ఎసిబి డిఎస్పీగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం నెల్లూరు అవినీతి నిరోధకశాఖలో శక్తి సన్నగిల్లిపోయింది. కొత్త డిఎస్పీ అయినా తమ శాఖ పాత వైభవానికి అనుగుణంగా పనిచేస్తే ప్రజల మన్ననలు పొందుతారు.

పిఆర్పీ రాష్ట్రకమిటీలో నెల్లూరీయులు

ప్రజారాజ్యంపార్టీ రాష్ట్ర కమిటీలో ఐదుగురు నెల్లూరీయులకు పార్టీ అధినేత చిరంజీవి చోటు కల్పించారు. నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి, తేళ్లపల్లి రాఘవయ్య, బషీర్‌లను రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నియమించారు. కొణిదెల సుధీర్‌ను రాష్ట్రకార్యదర్శిగా, గిలకా నరేంద్రను పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు.

కెనడా వెళ్లి వచ్చిన డాక్టర్ రాము

కెనడాలోని మాంట్రియల్‌లో ఈనెల 18తేది నుంచి 22 తేదీ వరకు జరిగిన అంతర్జాతీయ డయాబెటిస్ సదస్సుకు నెల్లూరు పొగతోటలోని షుగర్ డాక్టర్ వై.రాము హాజరయ్యారు. అక్కడి విషయాలను 28 తేది విలేకరులకు వివరించారు. ప్రపంచంలో అత్యధికంగా షుగర్ వ్యాధిగ్రస్తులు భారతదేశంలో వున్నారు. పిల్లల్లో టైప్-1 డయాబెటిస్ వ్యాధి ప్రబలేందుకు ఏంటిరోవైరస్ కారణమని తేలిందన్నారు. డి విటమిన్ లోపంతో షుగర్‌వ్యాధి వస్తుందని తాజా పరిశోధనల్లో వెల్లడయ్యిందన్నారు.

కమనీయంగా కళ్యాణమస్తు!

తిరుమల తిరుపతి దేవస్థానం నేతృత్వంలో జరిగిన ఐదవవిడత కళ్యాణమస్తు కార్యక్రమం కమనీయంగా జరిగింది. 28తేది జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 130 జంటల వివాహాలు జరిగాయి. నెల్లూరు టిటిడి కళ్యాణమండపంలో జరిగిన కళ్యాణమస్తు కార్యక్రమంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ సౌరభ్‌గౌర్, ఎమ్మెల్యేలు శ్రీధరకృష్ణారెడ్డి, వివేకానందరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కావలి, గూడూరు, నాయుడుపేట, వెంకటగిరి, వింజమూరు, ముత్తుకూరు, చేజర్ల లోనూ ఈ కార్యక్రమం జరిగింది.

వాళ్లను నమ్మొద్దు!

నెల్లూరు నగరంలో తాను చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదుకన్నా ప్రత్యర్థుల నమోదు జోరుగా సాగుతుండడం రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డిని చికాకు పెడుతుంది. దీంతో రాజీవ్ భవన్ నిర్వాహకులను ఆయన తిట్టి పోస్తున్నారు. 2,4 డివిజన్లలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వివేకానందరెడ్డి మాట్లాడుతూ కొంతమంది నాయకులు స్వార్థం కోసం ఇన్‌ఛార్జీల మంటూ నగరంలో తిరుగుతున్నారు. వాళ్లను నమ్మొద్దు. మాదే అసలు సిసలు సభ్యత్వ నమోదు కార్యక్రమం. అందువల్లే దీని ప్రారంభోత్సవానికి పిసిసి ఉపాధ్యక్షుడు మాదాసు గంగాధరం, జిల్లాపార్టీ వ్యవహారాల పరిశీలకుడు రుద్రరాజు పద్మరాజు హాజరయ్యారని చెప్పుకొంటున్నారు. పాపం... సభ్యత్వ నమోదులోనే వివేకానందరెడ్డికి ఎన్ని కష్టాలొచ్చి పడ్డాయి.

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి రూపంలో మాత్రమే పంపగలరు. చిక్కులు స్వీకరించబడవు.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పొగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190



కెనాడాలోని మాంట్రియల్‌లో జరిగిన అంతర్జాతీయ డయాబెటిక్ సదస్సులో పరిశోధకులతో నెల్లూరు షుగర్ డాక్టర్ వై.రాము

టిక్కెట్లు ఇచ్చేదెవరో?

ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగమన్నట్లు ఏడాది గడువున్న నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్లుగా పోటీచేసే వారికి తామంటే తాము టిక్కెట్లు ఇస్తామని నగర కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాలు ప్రకటించుకోవడం చర్చనీయాంశమయ్యింది. 2010 సెప్టెంబర్‌లో జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్లుగా టిక్కెట్లు ఇచ్చి వారిని గెలిపించి తమ సత్తా చూపిస్తామని నగర నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ ప్రకటిస్తే, ప్రతిగా ఆనంవారివీధిలోని కాంగ్రెస్ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి ఈసారి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసే 50 మంది కార్పొరేటర్లకు తానే టిక్కెట్లు ఇస్తానన్నారు. చివరికి టిక్కెట్లు ఎవరిస్తారన్నది 11 నెలలు ఆగితే గానీ తేలేట్లు లేదు.

నిరుద్యోగ తీవ్రతకు నిదర్శనం

జిల్లాలో పోస్టల్‌శాఖలో ఖాళీగా వున్న 33 పోస్టల్ అసిస్టెంట్ల భర్తీకి ఆ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. విచిత్రంగా ఏడువేల మంది నిరుద్యోగులు ఈ వుద్యోగాల కోసం దరఖాస్తు చేశారు. నవంబరు 20తేది వ్రాతపరీక్ష ఆ తర్వాత ట్రైపు, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పరీక్షించి తుది ఎంపిక పూర్తి చేస్తామని పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్వీ శివప్రసాద్ చెప్పారు.

వైఎస్ తొలి విగ్రహం

జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తొలి విగ్రహాన్ని అనుమసముద్రంపేట కొండమీద కొండూరు గ్రామంలో 25తేదీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆవిష్కరించారు. గ్రామస్తులు విరాళాలతో దీన్ని ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్‌కు తాము వీర విధేయులమని మాటల్లో చెప్పే నేతలు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొన్న గ్రామస్తులను చూసైనా మారితే అదే పదివేలు.

వాతావరణ కేంద్రాలు

జిల్లాలోని తీరప్రాంత మండలాల్లో ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను అంచనా వేసేందుకు ఐదు కేంద్రాలను చెన్నైలోని మెట్రాలజి డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేసింది. అల్లూరు, కావలి, ఇందుకూరుపేట, కోట, సూళ్లూరుపేట మండల కేంద్రాల్లో ఇవి పని చేస్తాయి. ఒక్కొక్క కేంద్రాన్ని రెండు లక్షలు వెచ్చించి అందుబాటులోనికి తెచ్చారు.

మరుపూరు అవార్డు ప్రదానం నవంబర్1న!

సుప్రసిద్ధ పాత్రికేయుడు, సాహితీవేత్త దివంగత మరుపూరు కోదండ రామిరెడ్డి స్మారకంగా నెలకొల్పిన సాహితీ

కొరవ 14వ పేజీలో

బంగారం స్పెషల్ ఆఫర్

BIS 916 హాల్‌మార్క్ బంగారు ఆభరణములపై సవరకు రూ.400/- తగ్గింపు. గ్రాముకు రూ.50/- తగ్గింపు. డైమండ్స్‌పై 10% తగ్గింపు.

గోల్డ్ ప్యాలస్

హోటల్ శివం ఎదురుగా, జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్, ఆచారివీధి, నెల్లూరు. ఫోన్: 2331133, 2327611

అమ్మ ఫర్నిచర్స్

"A House of Life style furnitures"

గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్, రాయల్ సోఫాకాంప్లెక్స్‌లోపల, నెల్లూరు. ఫోన్: 9246435666, 9849405665

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్వర్ణభారత్ ట్రస్ట్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ - హైదరాబాద్ ఆధ్వర్యంలో

స్వర్ణభారత్ ట్రస్ట్

గ్యాస్ట్రో ఎంట్రాలజీ (ఉదరకోశ విభాగాల)

ASIAN INSTITUTE OF GASTRO ENTEROLOGY

ఉచిత వైద్య శిబిరం

నవంబర్ 1, 2009 ఆదివారం ఉ॥ 9 గం॥ల నుండి మ॥ 2 గం॥ల వరకు

సభాధ్యక్షులు: శ్రీ ఎం. వెంకయ్య నాయుడు, ఎం.పి, Chairman, Parliamentary Standing Committee on Home Affairs

ముఖ్య అతిథి: పద్మశ్రీ డా॥ డి. నాగేశ్వర్ రెడ్డి, MD, DM, FAMS, FRCP

నిర్వహించు వైద్య పరీక్షలు: పచ్చ కామెర్లు, గాల్ బ్లాడర్ స్టోన్స్, లివర్, కడుపులో మంట, మల బద్ధకము, ఆకలి మందగించుట, గ్యాస్ ట్రబుల్, కడుపులో నొప్పి, కడుపులో గడ్డలు, రక్తపు వాంతులు, విరోచనాలు. అవసరమైన వారికి ఎండోస్కోపి, అల్ట్రాసౌండ్, నిర్ణీత రక్త, మూత్ర పరీక్షలు ఉచితముగా నిర్వహించబడును.

రోగులు ఈ రోజు సాయంత్రం లోపు పేర్లు నమోదు చేసుకోవాలి. తాత్కాలిక మందులు, వైద్య సలహాలు ఉచితం.

శాంతా బయోటెక్ హైదరాబాద్ వారి సౌజన్యంతో 14 సం॥లలోపు పిల్లలకు హెపటైటిస్-బి వ్యాక్సిన్ ఉచితంగా వేయబడును. ఈ వ్యాక్సిన్ 3 దఫాలుగా మొదటి డోసు నవంబర్ -1,2 తేదీలలో, రెండవ డోసు డిశంబరు -6, మూడవ డోసు జనవరి -10 వేయబడును. ఈ సదవకాశమును జిల్లాలోని పిల్లలందరూ సద్వినియోగపరచుకోగలరు.

వివరములకు: పద్మయ్య 9441084328, జనార్థనరాజు 94404 25225, 0861-2383504

ఇమ్మని దీపావెంకట, స్వర్ణభారత్ ట్రస్టీ.

జడ్పీ ఆమోదం తప్పనిసరి!



- సంక్షేమ శాఖలు యాక్షన్‌ప్లాన్‌లపై నిర్ణయం

జిల్లాలోని వివిధ సంక్షేమశాఖలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూపొందించిన ప్రణాళికలు ఇక నుంచి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమోదం పొందాల్సి వుంటుంది. స్థానిక సంస్థలకు దాఖలు పర్చిన అధికారాలలో భాగంగా సంక్షేమ శాఖలు రూపొందించిన ప్రణాళికలను జడ్పీ సర్వ సభ్య సమావేశంలో ప్రవేశపెట్టాలి. ఇప్పటివరకు సంక్షేమశాఖలు ప్రణాళికలను తయారుచేసి ప్రభుత్వానికి పంపి నిధులు నేరుగా మంజూరు చేయించుకొనేవి. దీనివల్ల యాక్షన్ ప్లాన్ గూర్చి ప్రజాప్రతినిధులకు తెలిసేదికాదు. ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం వివిధ సంక్షేమ శాఖల ప్రణాళికలు జడ్పీ ఆమోదం పొంది ప్రభుత్వానికి వెళ్లాలి. దీనివల్ల ప్రజాప్రతినిధులకు ప్రతి విషయం తెలుస్తుందని, అక్రమాలకు అడ్డుకట్టవడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం తీసుకొన్న ఈ నిర్ణయాన్ని ప్రజాప్రతినిధులంతా స్వాగతిస్తున్నారు.

తీరని బాధితుల వేదన!



విజృంభిస్తున్న కామెర్లు

నెల్లూరు నగర ప్రజలను ఇటీవలి కాలంలో పలు రకాల వ్యాధులు చుట్టుముడుతున్నాయి. విష జ్వరాలు, అతిసారతో నిన్నమొన్నటి వరకు అల్లాడిన ప్రజలు ఇప్పుడు స్వైన్‌ఫ్లూ పేరు చెబితేనే వణికిపోతున్నారు. ఇది చాలదన్నట్లు డెంగ్యూ జ్వరం మెల్లమెల్లగా పలువురిని కుంగదీస్తుంది. ఇవి కాకుండా కామెర్లు నగరవాసులను భయపెడుతున్నాయి. కలుషిత నీటిని తాగడం వల్ల ఈ వ్యాధి సులభంగా వచ్చేస్తుంది. ఈ వ్యాధిసోకిన వారిలో పిల్లలు అధిక సంఖ్యలో వున్నారు. నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, చిన్నపిల్లల ఆస్పత్రులు కామెర్ల వ్యాధితో బాధపడే రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇంతగా ప్రజలు వ్యాధులతో అతలాకుతలం అవుతున్నా మునిసిపల్ పాలకులు నీటి సరఫరాలో తగిన జాగ్రత్తలు తీసుకొని, లీకేజీలను అరికట్టడంలో శ్రద్ధ వహించక పోవడంతో మంచినీటి పైపుల్లో డ్రైనేజి నీరు చేరి కలుషితం అయ్యి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి.

వరద బాధితుల చేయూత!

కర్నూలు వరద బాధితులకు నెల్లూరు పోలీసు అధికారుల సంఘం ఆరులక్షల రూపాయల విలువ చేసే బియ్యం, నిత్యావసర వస్తువులు, బట్టలను సేకరించి పంపింది. ఈ వస్తువులతో బయలుదేరిన వాహనాలకు ఎస్పీ మల్లారెడ్డి 24తేది పచ్చజెండా ఊపారు. వరద బాధితుల సహాయార్థం బియ్యం, నగదు, దుస్తులను సేకరించ

- మంచిపని చేసిన నెల్లూరు పోలీసులు

మంటే పోలీసులు చేతివాటం చూపి గబ్బు పట్టించే అవకాశముండడంతో ఈ బాధ్యతలను డిఎస్పీలకు అప్పగించారు. వారు తమకున్న పరిచయాలతో హుందాగా గుప్తదాతలను అభ్యర్థించి మూడో కంటికి తెలియకుండా ఈ మొత్తాన్ని సేకరించిపెట్టారు. ఇంకా వరద సాయం అందని ప్రాంతాన్ని ఎంచుకొని ఈ సాయం అందిస్తామని ఎస్పీ మల్లారెడ్డి చెప్పారు.పోతున్నారు.

జిల్లాలైను
పొగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

తీరొన్ పోలీసుల నొక్కుడు



కంచె చేను మేసిన చందాన వుంది నెల్లూరు త్రీటౌన్ పోలీసుల పనితీరు. ఎవరో ఒకరు ఫోన్ చేసి సమాచారం అందించడంతో సింగిల్ నెంబర్లాట, పేకాట నిర్వాహకులపై త్రీటౌన్ పోలీసులు దాడి చేస్తున్నారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకొని కోర్టులో మాత్రం నామమాత్రంగా నగదు చూపించి చేతులు దులుపుకొంటున్నారు. 25తేది త్రీటౌన్ పోలీసులు కావూవీధిలోని ఓ ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్ కార్యాలయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఆ కార్యాలయంపై దాడి చేశారు. కొన్నిది మందిని అరెస్టు చేసి పది సెల్ ఫోన్లు, లక్షన్నరకుపైగా నగదు స్వాధీనపరచుకొన్నారు. అయితే త్రీటౌన్ ఎస్‌ఐ పెంచలరెడ్డి పేకాట ఆడుతున్న వారి వద్ద స్వాధీనం చేసుకొన్నది 19వేలు మాత్రమేనని మీడియాకు చెప్పారు. పేకాట రాయుళ్లను, ఈ మొత్తాన్నే 26తేది కోర్టుకు సమర్పించారు. పేకాటరాయుళ్ల మాత్రం తమ వద్ద పోలీసులు లక్షన్నర రూపాయలు పట్టుకొన్నట్లు చెబుతున్నారు. గతంలో వన్‌టౌన్ ఎస్‌ఐగా పని చేసిన వీరేంద్రబాబు జడే ఫక్కీలో కానసాగేవారు. పెంచలరెడ్డి ప్రస్తుతం ఆయన్ను అనుసరిస్తున్నారు. స్టేషన్‌లో ప్రైవేటు పంచాయితీలు, డబ్బులిచ్చిన వారికే న్యాయం చేస్తున్నారు. మేకపాటి సోదరులు ఈ ఎస్‌ఐకు అందదండలందిస్తుండడంతో ఎస్పీ సైతం ఇతన్ని పల్లెత్తు మాట అనడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులే దొంగసొత్తును నొక్కేయడం ధర్మమా?

లక్షలు స్వాధీనం వేలల్లో చూపెడుతున్నారు

మాగుంట లేఅవుట్‌లో అక్రమ కొళాయిలు

ఇచ్చింది కార్పొరేషన్ సిబ్బందే

కార్పొరేషన్ అధికారులు చేసిన ఘోరానా మోసం వల్ల మాగుంట లేఅవుట్ వాసులంతా అక్రమ కొళాయి కనెక్షన్లు పొందాల్సి వచ్చింది. ఈ మధ్య వరకు మాగుంట లేఅవుట్‌కు మునిసిపల్ నీళ్లు వెళ్లేవికావు. ట్యాంకు కట్టి చాలా రోజులైనా ఇటీవల పైపులైన్లు వేసి కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. వాస్తవానికి మునిసిపల్ కొళాయి వేయించుకోవాలంటే ఏడువేల రూపాయలు డిపాజిట్‌గా కట్టాలి. 1500 రూపాయలు అడ్వాన్స్‌టాక్స్, ఎక్స్‌టెన్షన్ ఛార్జి తగినంత చెల్లించి వర్క్ ఆర్డర్ పొంది కొళాయి వేయించుకోవాలి. కాని ఈ ప్రాంతంలో పనిచేసే వాటర్‌వర్క్ సిబ్బంది వీరి వద్ద 12,500 రూపాయల నుంచి 15వేల రూపాయల వరకు తీసుకొని మరుసటిరోజు కొళాయి కనెక్షన్లు ఇచ్చేశారు. కొళాయిలు వచ్చిన సంబరంలో తాము అక్రమరీతిలో వీటిని పొందామన్న విషయాన్ని ఈ ప్రాంతీయులు తెలుసుకోలేకపోయారు. మాగుంట లేఅవుట్‌లో కొళాయిల కోసమని లక్షల్లో వసూలు చేసిన మొత్తంలో కమిషనర్, మేయర్‌లకు వాటా ఇవ్వడం వల్ల తమకేమీ కాదన్న ధైర్యంతో వాటర్ వర్క్స్ సిబ్బంది వున్నారు. నగరంలో కార్పొరేషన్ సిబ్బంది ఇప్పటివరకు కనెక్షన్లు ఇచ్చిన కొళాయిల్లో ఎనిమిదివేలు అక్రమమని విజిలెన్స్ అధికారుల తనిఖీలో బయటపడింది. కొత్తగా మాగుంటలేఅవుట్‌లో కనెక్షన్లను పాత వాటిలో కలుపుకొంటే ఈ సంఖ్య పదివేలకు దాటింది. మునిసిపాలిటి కార్పొరేషన్ అయ్యాక సాధించిన అక్రమ ప్రగతి ఏదైనా వుంటే ఇవి అక్రమ కొళాయిలని ధంకా బజాయించి చెప్పుకోవచ్చు.



స్వైన్‌ఫ్లూకు చికిత్స చేయడం లేదు!

స్వైన్‌ఫ్లూ వ్యాధి నెల్లూరీయులను ఒకప్రక్క గడగడలాడిస్తుంటే; ఈ వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించను నగరంలోని కార్పొరేట్ హాస్పిటళ్లు నిరాకరిస్తున్నాయి. గతవారం స్వైన్‌ఫ్లూ వ్యాధితో మరణించిన కావలి టీచర్ నాగరాజుకు వ్యాధి లక్షణాలు కనపడగానే ముందు నగరంలోని రెండు కార్పొరేట్ హాస్పిటళ్లకు వైద్యం కోసం వెళ్తే వారు చేర్చుకోను ససేమిరా అన్నారట. దీంతో ఆయన అరవిందనగర్‌లోని నెల్లూరు హాస్పిటల్‌లో చేరి అక్కడి వైద్యుల సలహా మీదట చెన్నైలోని రామచంద్ర మెడికల్ కాలేజి వెళ్లారు. వైద్యం అందించడంలో జరిగిన జాప్యం నాగరాజు ప్రాణాలు తీసింది. ఆయన శవాన్ని 24తేది చెన్నై నుంచి కావలిలోని శ్మశానవాటికకు నేరుగా తరలించారు. అక్కడే ఆయన బంధువులు ముక్కులు మూసుకొని మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. స్వైన్‌ఫ్లూ వ్యాధిసోకిన మరో ఇద్దరు నెల్లూరీయులు కూడా చెన్నైలోని ఆసుపత్రులలోనే చికిత్స పొందుతున్నారు. నెల్లూరు, గూడూరు, కావలి పెద్దాస్పత్రులలో ఏర్పాటు చేసిన స్వైన్‌ఫ్లూ వార్డులలో చేరి చికిత్స పొందను ఈ వ్యాధిగ్రస్తులకు ధైర్యం చాలదం లేదు. కావలికి చెందిన వస్త్రవ్యాపారులు గుజరాత్‌లోని సూరత్‌తోపాటు ముంబాయికు వస్త్రాలు కొనను వెళ్తారు. అక్కడనుంచి ఈ వ్యాధి దిగుమతి అయ్యిందని చెప్పి వైద్యఆరోగ్య శాఖాధికారులు చేతులు దులుపుకొంటున్నారే తప్ప వ్యాధిగ్రస్తులకు వైద్యం చేయని కార్పొరేట్ హాస్పిటళ్లను మాటవరుసకు కూడా అడిగే ధైర్యం చేయడం లేదు.

● కండలేరు

ముంపువాసుల కష్టాలు తీరవా?

తెలుగుగంగ పథకంలో భాగమైన కండలేరు జలాశయం ఏర్పాటుకు 22 గ్రామాల ప్రజలను 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ఖాళీ చేయించింది. కాని నేటికీ పలు గ్రామాల ప్రజలకు నష్టపరిహారం, పునరావాసం కల్పించలేదు. వినేవారిని ఆశ్చర్యపరచినా ఇది మాత్రం అక్షర సత్యం.

కండలేరు జలాశయం కోసం భూములు, ఇళ్లను కోల్పోయి గ్రామాలను వదిలి వెళ్లిన ముంపువాసులు అనేక కష్టాలు పడుతున్నారు. వీరు పడుతున్న కష్టాల గురించి అటు ప్రజాప్రతినిధులు, ఇటు సంబంధిత శాఖాధికార్లు ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. కండలేరు జలాశయం కోసం సేకరించిన భూములు, గ్రామాలను ఖాళీచేసిన ప్రజలకు సరైన నష్టపరిహారం చెల్లించడంలో తెలుగుగంగ అధికారులతోపాటు రెవిన్యూ అధికారులు అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకున్న అధికారులు ముంపువాసుల నష్ట పరిహారాన్ని దోచుకుతిన్నారు.

22 గ్రామాలు ఖాళీ చేయించారు

తెలుగుగంగ పథకంలో భాగమైన కండలేరు జలాశయం ఏర్పాటుకు 22 గ్రామాలను ప్రభుత్వం ఖాళీ చేయించడం జరిగింది. గ్రామాలను వదిలి వెళ్లిన వారికి అన్నివిధాల నష్టపరిహారం చెల్లించడంతోపాటు పునరావాసం కూడా కల్పించి మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేసే విధంగా అప్పట్లో గ్రామస్తులకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. సేకరించిన భూములకు లెక్కలు కట్టే దగ్గర నుంచి నగదు చెల్లింపు, పునరావాస ఏర్పాట్లుచేసే వరకు ప్రతి దగ్గర అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వచ్చారు. ఐదు ఎకరాలు కలిగిన రైతులకు నాలుగు ఎకరాలకు నష్టపరిహారం చెల్లించడం కుటుంబంలో ఇద్దరికి పునరావాసం క్రింద ఇళ్లపాట్లు ఇవ్వాల్సివుంటే ఒక్కరికే ఇవ్వడం వంటి పనులకు పాల్పడ్డారు. రైతుల నుంచి కండలేరు జలాశయం ఏర్పాటుకోసం సేకరించిన భూములకు మార్కెట్ ధర ప్రకారం కూడా నష్టపరిహారం అందలేదు. దీంతో బాధిత రైతులు మండలస్థాయి అధికారి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు అనేక వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయింది. దాదాపు 20 సంవత్సరాల క్రితం సేకరించిన భూములకు నేటికీ కొందరికి నష్టపరిహారం అందలేదంటే అధికారులు, ప్రజాప్రతినిధులు ముంపు గ్రామాల ప్రజల గురించి ఏమాత్రం పట్టించుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు.

అధికారుల చేతివాటం

రాపూరు మండలంలోని గోనుపల్లి, పెనుబర్తి, కమ్మపాళెం తదితర గ్రామాల ప్రజలకు పెంచలకోన, పొదలకూరు సమీపంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ముంపు గ్రామాల ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, పక్కాగృహాల నిర్మాణం కోసం 50వేల రూపాయలు మంజూరు చేశారు. పక్కాగృహాల నిర్మాణం కోసం మంజూరు చేసే 50వేల రూపాయలు కూడా బాధితులకు అందించడంలో తెలుగుగంగ పథకం అధికారులు చేతివాటం ప్రదర్శించారు. ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ నాయకులు చెప్పిన విధంగా అధికారులు నడుచుకొంటున్నారు. అధికారుల చర్యల కారణంగా బాధితులకు తీరని అన్యాయమే జరిగింది.

కండలేరు జలాశయం ఏర్పాటుకు భూములు, గ్రామాలను వదిలి వెళ్లిన పెనుబర్తి, గోనుపల్లి ముంపు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించేందుకు ఇటీవల "జమీన్‌రైతు" విలేకరుల బృందం పై గ్రామాలను సందర్శించి రావడం జరిగింది. గ్రామాలను సందర్శించినప్పుడు ముంపువాసులు తాము పడుతున్న ఇబ్బందులు వివరించడంతోపాటు తెలుగుగంగ పథకం అధికారులు, ప్రజాప్రతినిధుల వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముంపు గ్రామాల ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి అధికారులు చేతులు దులుపుకున్నారే తప్ప ఇక్కడ ఎటువంటి సదుపాయాలు కల్పించలేదని వారు వాపోయారు.

త్రాగేందుకు మంచి నీరు కూడా దొరక్క ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర నష్టపరిహారం అందజేసి తమకెటువంటి సంబంధం లేదన్న విధంగా అధికారులు వ్యవహరిస్తుండడం తమను తీరని ఆవేదనకు గురిచేస్తుందని విలపించారు.



పెనుబర్తిలో ఎన్నోఏళ్లుగా పని పూర్తిగాని వాటర్ ట్యాంక్.

పెనుబర్తి గ్రామ ప్రజలకు పునరావాసం ఏర్పాటుచేసిన ప్రాంతానికి సమీపంలో ప్రభుత్వ, అటవీ భూములు వున్నాయని వాటిని ముంపువాసులకు పంపిణీచేస్తే, సాగుచేసి మెట్టపైర్లు వేసుకుని జీవించేందుకు ఆస్కారం వుంటుందని వివరించారు. పెనుబర్తి గ్రామంలో దాదాపు 800 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. అప్పుడు ఎకరా మాగాణికి 16వేలు, మెట్టకు 7,500 రూపాయలు నష్ట పరిహారంగా నిర్ణయించారు.

తెలుగుగంగ అధికారుల అవినీతి

తెలుగుగంగ పథకంలో భాగమైన కండలేరు జలాశయం ఏర్పాటుకు భూములు సేకరించిన తెలుగుగంగ పథకం భూసేకరణ అధికారులు, సిబ్బంది నష్టపరిహారం చెల్లించే క్రమంలో లక్షలాది రూపాయల నిధులు స్వాహా చేశారు. ఒకే భూములకు రెండు సర్వే నెంబర్లు సృష్టించి పట్టాదారులకు ఒకసారి, బినామీదారులకు మరోసారి నష్టపరిహారం చెల్లించిన సంఘటనలు అనేకం వున్నాయి. తెలుగుగంగ పథకం అధికారులు, సిబ్బందికితోడు గ్రామ రెవిన్యూ అధికారి, పంచాయితీ కార్యదర్శులు సైతం అవినీతి, అక్రమాల్లో భాగస్వాములవుతున్నారు.

1990 సంవత్సరంలో సర్వే నెంబర్ 314/1, 314/2, 314/3 లలో ఎనిమిది మంది బాధితులకు నష్టపరిహారంగా చెల్లించారు. 1994 సంవత్సరంలో ఇవే భూములకు 314/5 సర్వే నెంబర్‌ను సృష్టించి ముంపు గ్రామాల ప్రజలు లేని విడవలూరు మండలానికి చెందిన మరో ఎనిమిది మందికి నష్టపరిహారం అందజేసిన ఘనత తెలుగుగంగ భూసేకరణ అధికారులకే దక్కుతుంది. బినామీదార్లకు నష్టపరిహారం ఇప్పించడంలో అప్పటి సొసైటీ కార్యదర్శి చంద్ర మోహన్ కీలకపాత్ర పోషించాడని ముంపువాసులు వెల్లడించారు. వచ్చిన నష్టపరిహారం అందరూ సమానంగా వాటాలు పంచుకున్నారు.

జిల్లా కేంద్రానికి 80-100 కిలోమీటర్ల దూరంలోని కండలేరు జలాశయం ముంపు గ్రామాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులకు విన్నవించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. తెలుగుగంగ పథకం డిప్యూటీ కలెక్టర్ రాపూరులో ఉన్నప్పటికీ ఆయన ఎప్పుడూ ముంపు గ్రామాల ప్రజలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించిన దాఖలాల్లేవు. బాధితులు ఆయన కోసం కార్యాలయానికి వెళ్తే అందుబాటులో లేకుండా పోతుంటాడు. ముంపుకుగురైన గ్రామాలు గతంలో రాపూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వుండేవి. నియోజకవర్గాల పునర్విభజనలో ఇవి ప్రస్తుతం వెంకటగిరి నియోజకవర్గంలో చేరాయి. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాపూరు ఎమ్మెల్యేగా వున్న సమయంలో పునరావాస కేంద్రాల ఏర్పాట్లు జరిగాయి. అయితే ప్రజలకు జీవనాధారం కల్పించడంలో ఎమ్మెల్యే ప్రభుత్వంపై వత్తిడి తీసుకురాలేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కండలేరు జలాశయం ముంపు గ్రామాల ప్రజలు వెల్లడించిన అభిప్రాయాలను ప్రక్కనిస్తున్నాం.



అధికారుల నిర్లక్ష్యం!

ముంపు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పించి, అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయడంలో తెలుగుగంగ పథకం అధికారులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అలాగే ముంపుకు గురైన మాకు నష్టపరిహారం చెల్లించడంలో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పునరావాస కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి.

జి.జానకిరామిరెడ్డి, పెనుబర్తి



అధికారుల అవినీతి!

కండలేరు జలాశయం కోసం భూములు సేకరించిన తెలుగుగంగ పథకం అధికారులు బాధితులకు నష్టపరిహారం అందించే క్రమంలో అవినీతికి పాల్పడ్డారు. అధికారులు అడిగిన కమీషన్ ఇవ్వకుంటే నష్టపరిహారంలో కోత విధించడంతోపాటు కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా త్రిప్పుకుంటారు. ఇప్పటికే నష్టపరిహారం కోసం అనేక మంది తిరుగుతున్నారు.

షేక్ మీరాసాహెబ్, పెనుబర్తి



పరిహారం ఇప్పించాలి!

కండలేరు జలాశయం కోసం 50 సెంట్ల మాగాణి భూమిని తెలుగుగంగ అధికారులు తీసుకుని పది సంవత్సరాలు గడిచిపోయాయి. అయినా కూడా ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రస్తుతం నేను అనారోగ్యంతో బాధపడుతూ బయట తిరగలేకపోతున్నాను. జిల్లా కలెక్టర్ స్పందించి నష్టపరిహారం ఇప్పించాలి.

మునెమ్మ, పెనుబర్తి



ఇళ్ల నిర్మాణ నగదు స్వాహా!

పునరావాస కేంద్రాలలో పక్కాగృహాల నిర్మాణం కోసం ప్రభుత్వం 50 వేల రూపాయలు మంజూరు చేసింది. అయితే తెలుగుగంగ పథకం అధికారులు ఈ నిధులను సకాలంలో బాధితులకు ఇవ్వడంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. 50 వేల రూపాయలు ఇవ్వాల్సివుండగా 40వేలకు మించి అందించడం లేదు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకునే దిక్కు లేకుండా పోయారు.

చంద్రశేఖర్‌రెడ్డి, పెనుబర్తి

అవినీతి ఎమ్మార్వో బదిలీ

" కలెక్టరేట్ చేరిన సుశీలమ్మ "

ఎక్కడ పనిచేసినా పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతూ, సంపన్నులకు, రాజకీయంగా పలుకుబడిగల వారికి కొమ్ముకాస్తూ బాగా గడించిన ఎమ్మార్వో సుశీలమ్మ పని చేసిన చోటల్లా భారీ మొత్తంలో జమ చేసుకొనే ఆమెను ఎట్టకేలకు చేసిన అక్రమాలు రుజువై కలెక్టరేట్‌లో పనికిమాలిన విభాగానికి బదలీ చేశారు. మనుబోలు తహశీల్దార్‌గా పనిచేస్తుండిన సుశీలమ్మ తడ మండలంలోని గొట్లపాళెం దళితులకు అన్యాయం చేసి పెత్తందార్లకు కొమ్ముకాసింది. సర్వే నెంబరు 317లో 23/2,3,4,5 లోని భూములను పేదలకు కేటాయించారు. వాళ్లు ఆ స్థలంలో గృహనిర్మాణానికి పూనుకొని పునాదులు త్రవ్వుకొన్నారు. దీనిని సహించలేని భూస్వాములు ఈ పనులను అడ్డుకొని ఘర్షణకు దిగారు. దీనిపై తహశీల్దార్ సుశీలమ్మకు ఫిర్యాదు అందినా ఆమె పేదలకు న్యాయం చేయాల్సింది పోయి భూస్వాములకు తోడ్పాటునందించడంతో దీనిని నిరసిస్తూ దళితులు, స్థానిక ప్రజలు ఆందోళన చేపట్టారు. దీనిపై ఆర్‌డివో జరిపిన విచారణలో సుశీలమ్మ చేసిన నిర్వాకం బట్టబయలు కావడంతో ఆమెను కలెక్టరేట్‌లోని కోనేరు రంగారావు కమిటీ అమలు విభాగానికి సాగనంపారు. గతంలో సుశీలమ్మ ముత్తుకూరు తహశీల్దార్‌గా పని చేసిన సమయంలోనూ పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీలో అవకతవకలకు పాల్పడడంతో ఆనాటి ఆర్‌డివో వెంకట్రామిరెడ్డి ఈమెను సస్పెండ్ చేయగా రాజకీయ పలుకుబడి ఉపయోగించి దానిని రద్దు చేయించుకొంది. తోటపల్లి గూడూరు మండలంలో పని చేసేటప్పుడు మండపం యాష్‌పాండ్ భూముల నివేదికలోనూ అక్రమాలకు పాల్పడింది. వరిగొండలో ఇళ్ల స్థలాల కోసం ఆమె జారీ చేసిన పట్టాల వ్యవహారంపై దూమారం రేగింది. అప్పుడు కూడా ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డిని బ్రతిమలాడుకొని బయటపడింది. కానీ మనుబోలులో మాత్రం ఆమె అవినీతి అక్రమాలు బట్టబయలై మెడకు చుట్టుకొని బదలీ వేటు పడింది.



వరద బాధితుల సహాయార్థం మంత్రి రామనారాయణరెడ్డికి 30వేల రూపాయల చెక్కును అందిస్తున్న ఇందుకూరుపేట జి.వి.కె డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ నై.వి.సుబ్రహ్మణ్యం, విద్యార్థులు.



నెల్లూరు ఆదిత్య డిగ్రీ కాలేజీలో తిక్కన రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సిపి బ్రౌన్ స్మారక సాహిత్య సభలో సంఘం అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, లతీఫ్‌కుద్రి, డాక్టర్ సింగరాజు రామకృష్ణయ్య, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు.

• బుచ్చిలో పరిస్థితిది

విషజ్వరాల విజృంభణ

బుచ్చిరెడ్డిపాళెం మండలంలో విషజ్వరాల తాకిడి ఎక్కువైంది. పలు గ్రామాల ప్రజలు జ్వరాల బారినపడి అల్లాడుతున్నారు. వైద్యం చేయించుకొందామంటే ప్రభుత్వ డాక్టర్లు అందుబాటులో లేక పోవడం, ప్రైవేట్ ఆస్పత్రికి పోవడానికి డబ్బులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలో 15 పంచాయితీలు వుండగా అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేసి వుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇస్కపాళెం, జొన్నవాడ, మినగల్లు, చల్లాయపాళెం, దామరమడుగు పంచాయితీలలో ఎక్కువ భాగం మురికి, చెత్తకుప్పలతోపాటు పందులు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలకు అంటురోగాలు సోకుతున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రజలను వణికిస్తున్నాయి. బుచ్చిపట్టణంలోని ఖాజానగర్, రామకృష్ణానగర్ ప్రాంతాల్లో పలువురికి మలేరియా, అతిసార సోకడంతో నెల్లూరులో చికిత్స పొందాల్సి వచ్చింది. గాంధీనగర్‌లో రెండు రోజుల క్రిందట దాసరి సుబ్రమణ్యం అనే వ్యక్తి డెంగూవ్యాధికి గురై ప్రాణాలు కోల్పోయాడు. వీటికి తోడు దోమల బెడద అధికంగా వుండడంతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఫాగింగ్‌మిషన్ వున్నా అది నిరుపయోగంగా మారడంతో మండల ప్రజలు రోగాలతో సహజీవనం చేయాల్సి వస్తోంది.

మద్యం వ్యాపారుల ఇష్టారాజ్యం

ఆత్మకూరులో మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధరల ప్రకారం మద్యం అమ్మకాలు జరపాల్సి వున్నా వాటిని అమలుచేయక తమ ఇష్టానుసారం అధికధరలకు అమ్మకాలు చేస్తున్నారు. నెల్లూరులో వున్న రేట్ల కంటే అధికంగా వసూలు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో వారికి అడ్డు ఆపు లేకుండా పోయింది. ఎవరైనా ఫిర్యాదు చేసినా చెత్త బుట్టలో పారేస్తుండడం తప్ప మద్యం వ్యాపారులపై చర్యలు తీసుకోవడంలో మామూళ్లు అడ్డొస్తున్నాయి. మద్యం ప్రియుల బలహీనతను ఆసరా చేసుకొని వ్యాపారులు సాగిస్తున్న విచ్చలవిడి అమ్మకాలపై ఆత్మకూరు సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి పలుమార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకొనేనాథుడే లేకుండా పోయారు. ఇక డ్రైడే వచ్చిందంటే మద్యం వ్యాపారులకు పండుగే. ఆరోజున వీరు అమ్మే ధరలకు మద్యంకొని త్రాగలేక హడలిపోతున్నారు.

సాగునీటికి చింత

" ప్రక్క నుంచే తెలుగుగంగ నీరు వెళ్తున్నా చూస్తుండాల్సిందే."

వెంకటగిరి చెంత నుంచే తెలుగుగంగ నీరు చెన్నైకి వెళ్తున్నా సాగునీటి కోసం ఈ ప్రాంత రైతులు అవస్థలు పడాల్సివస్తోంది. వర్షం లేక చెరువులకు నీరు చేరకపోవడంతో సాగునీటి సమస్య ఎదుర్కొంటున్న రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించలేదు. రైతుల అవసరాలకు ఈ నెల 15తేది స్వర్ణముఖి నదికి అధికారులు గంగ నీటిని విడుదలచేసినా వెంకటగిరి ప్రాంతంలోని చెరువులకు అధికారికంగా నీరు తీసుకొనే వసతి లేకపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు. సాహసించి ఆ ప్రయత్నం చేసిన రైతుల మధ్య వివాదాలు చోటు చేసుకొంటున్నాయి. డక్కిలి ప్రాంతంలో నాల్గవ బ్రాంచి కెనాల్ నుంచి పిల్లకాలువల ద్వారా దాదాపు 500 ఎకరాల మెట్ట పొలాలకు తెలుగుగంగ నీరు అందిస్తున్నారు. దీని కోసం దాదాపు 4 కి.మీ వున్న ఈ కాలువకు 1.5 కి.మీ దూరం పైపులు వేసి మిగతా చోట ఓపెన్ కాలువను త్రవ్వారు. పైపులు వేసిన చోటు నుంచి చావలపల్లి చెరువుకు గంగనీటిని మళ్లించడానికి రైతులు రహస్యంగా ప్రయత్నించబోగా ఆ సంగతి తెలుసుకొన్న మిట్టపాళెం రైతులు అక్కడికి చేరుకొని రైతులను అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది.

ఉపాధిపై పంటపాళెం వాసుల ఆశలు

చకాచకా ఆయిల్ రిఫైనరీ పనులు

ముత్తుకూరు మండలం, పంటపాళెం, ఈపూరు ప్రాంతాల్లో నిర్మితమవుతున్న ఆయిల్ రిఫైనరీల పరిశ్రమల పనులు చురుగ్గా సాగుతున్నాయి. కృష్ణపట్నం పోర్టుకు వచ్చే ముడి చమురును దిగుమతి చేసుకోవాలంటే ఆయిల్ రిఫైనరీల అవసరం ఎంతో వుందట. దీనిని దృష్టిలో వుంచుకొని ఈ ప్రాంతంలో నాలుగు రిఫైనరీలు ఏర్పాటు కానున్నాయి. పోర్టు నుంచి ముడి చమురును పైపులైను ద్వారా దిగుమతి చేసుకోవడానికి ఈపూరు పరిసర ప్రాంతాలు అనువుగా వుండడంతో ఇక్కడ రిఫైనరీ ఏర్పాటుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందివ్వడంతో వీటి ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పంజాబ్ రాష్ట్రానికి చెందిన పారిశ్రామికవేత్తలు ఈ రిఫైనరీలు స్థాపించేందుకు ముందుకు రావడంతో నిర్మాణ పనులు ప్రారంభం అయ్యాయి. ఈ పరిశ్రమల ఏర్పాటుతోనైనా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు దొరుకుతాయని చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

డ్యూటీకిరాని ఐచ్ఛి ప్రభుత్వానుపత్రి వైద్యులు

ప్రైవేట్ ప్రాక్టీసులో బిజీ

వైద్యుడిని రోగులు దైవంతో సమానంగా భావిస్తారు, గౌరవిస్తారు. ప్రాణాలు నిలిపేవాడు కాబట్టి దేవుడని కొలుస్తారు. అలాంటి డాక్టర్లు ప్రాణాలు నిలపడం మాట అటుంచి తమ నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రాణాలు పోయేందుకు కారణమవడం వైద్యవృత్తిలోని వారు సిగ్గుపడాల్సిన విషయం. ఐచ్ఛి ప్రభుత్వ ఆసుపత్రికి చుట్టుప్రక్కల గ్రామాల నుంచి వైద్యం కోసం పలువురు రోగులు వస్తుంటారు. వీరిలో అధికులు పేదలు అలాంటి వారికి వైద్యం చేయాల్సిన డాక్టర్లు విధులు ఎగ్గొట్టి ప్రైవేట్ ప్రాక్టీస్‌లో మునిగి తేలుతుండడంతో ప్రాణాపాయ పరిస్థితిలో వచ్చినవారు సకాలంలో చికిత్స అందక ప్రాణాలు పొగొట్టుకొంటున్న సంఘటనలు ఇటీవలకాలంలో అధికం అవుతున్నాయి. సంగం మందలం మర్రిపాడుకు చెందిన రమణమ్మ అనే మహిళ, పల్లిపాళెంకు చెందిన మస్తానమ్మ అనే మహిళ ప్రైవేట్ డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే ప్రాణాలు పొగొట్టుకొన్నారు. దీనిపై వారి బంధువులు డాక్టర్‌తో గొడవకు దిగడంతో పెద్దలు రాజీ కుదిర్చి కొంత నగదు ముట్టజెప్పారట. ఇలాంటి సంఘటనలు వరుసగా జరుగుతున్నా ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్లు రాజకీయ నాయకులను ఆశ్రయించో, నగదు పరిహారంగా అందజేసో బయటపడుతున్నారు. కానీ ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు జరిగిన నష్టం మాత్రం ఎవరూ పూడ్చలేనిది.



వరద బాధితులకు నెల్లూరుజిల్లా ఐలియన్, డైమండ్ వ్యాపారుల సంఘం తరపున 8లక్షల 26వేల 660 రూపాయల చెక్కును ముఖ్యమంత్రి రోశయ్యను హైదరాబాద్‌లో కలసి అందిస్తున్న సంఘ నాయకులు శాంతిలాల్ జైన్, మణిలాల్ జైన్, శంకర్‌లాల్ జైన్, సత్యం, రమేష్‌బాబు.


వెంకటగిరి రైల్వేస్టేషన్ తనిఖీ!

వెంకటగిరి రైల్వేస్టేషన్‌ను గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ జెఎస్వీ సింగ్ తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్ అసాంతం క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆయన అక్కడి పరిస్థితులను చూసి సిబ్బందిపై మండిపడ్డాడు. దుర్గంధభరితంగా వున్న మరుగుదొడ్లు, ప్రయాణీకుల విశ్రాంతి గదిలో ఫ్యాన్లు లేకపోవడాన్ని గమనించిన ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో అయితే ఇలాగే ఉంచుకొంటారా. ఇంత వాసన వస్తున్నా మరుగుదొడ్లను శుభ్రపరచరా? మీరంతా ఏం చేస్తున్నారు. సూచిక బోర్డుల్లో తప్పులు వుండడంపైనా ఆయన ఆక్షేపాన్ని వ్యక్తం చేశారు. కూర్చొనే బల్లలు మట్టికొట్టుకొని వుండడాన్ని పరిశీలించిన ఆయన ఈ బల్లలపై అపరిశుభ్ర వాతావరణంలో మీరు కూర్చొంటారా? ప్రయాణీకుల పట్ల ఎందుకంత నిర్లక్ష్యమంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన రైల్వే వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని బాధ్యులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. రైల్వేసిబ్బంది స్టేషన్‌లో అవకతవకలు డి.ఆర్.ఎం దృష్టికి పోకుండా జాగ్రత్తపడినా ఆయన అన్నీ తనిఖీ చేయడంతో అసలు వ్యవహారం బయటపడింది.

మంచి నారుతో మంచి దిగుబడి

ఆరోగ్యకరమైన నారు ఉపయోగించడం వలన అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా నారుమడుల తయారీలో యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్నారు. జిల్లాలో రబీ సీజన్ క్రింద 5.50 లక్షల ఎకరాల్లో వరిసాగవుతున్నందున రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు వ్యవసాయ శాస్త్రవేత్తలు. నారుమడికి కేటాయించిన పొలంలో 15 రోజులు ముందుగా సేంద్రీయ ఎరువులను వాడాలన్నారు. ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల సత్రజని, కిలో పొటాషియం, కిలో భాస్వరం ఎరువులను దుక్కిలో వేసుకోవాలన్నారు. విత్తనాల ఎంపికలోనూ రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నారుమడిలో చల్లుకొనే విత్తనాలను ముందుగా వడకట్టి మొలకశాతాన్ని పరిశీలించాలని, రబీ సీజన్‌లో ఎన్ఎల్ఆర్ 64449, టిటిటి 5204 రకాలు మంచి దిగుబడినిస్తాయన్నారు. విత్తనాలను శుద్ధి చేయడం వలన తెగుళ్ల బెడద తగ్గి సాగు వ్యయం తగ్గుతుందన్నారు.





సోమశిలకు జలకళ

సోమశిల జలాశయానికి పైనుంచి వరద నీరొచ్చి చేరడంతో జలాశయంలో నిండుగా నీరు చేరి కళకళలాడుతోంది. జలకళతో అలరారుతున్న జలాశయం అందాలను తిలకించేందుకు పర్యాటకులు ఈ ప్రాంతానికి బారులు తీరుతుండడంతో సోమశిలలో సందడిగా వుంది. ప్రక్కనే గల సోమేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. సుబ్రమణ్య ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా వుంది. డ్యాంకు వెళ్లే రహదారి చుట్టుప్రక్కల పచ్చనిగడ్డి, పూలమొక్కలతో కొత్త అందాలను సంతరించుకొని వుంది. స్పిల్‌వే నుంచి చూస్తే నీరు చేతికి అందేలా వున్నాయి. అధికసంఖ్యలో పర్యాటకులు జలాశయ అందాలను వీక్షించడానికి వస్తుంటే రక్షణ వ్యవస్థ మాత్రం పటిష్టంగా లేదనే చెప్పాలి. నిషిద్ధ ప్రాంతంలో కూడా పలువురు పర్యాటకులు తిరుగుతుండడం కన్పిస్తోంది. ఇప్పటికైనా పర్యాటకులకు చక్కని వాతావరణం కల్పించడంతోపాటు తగిన రక్షణ చర్యలు చేపట్టాల్సి వుంది.

ఊరొకటి... బోర్డొకటి!


వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రైల్వేస్టేషన్లు ఒక ప్రాంతంలో వుంటే పేరు మాత్రం మరొక ఊరిది వుంటున్నది. ఇటీవలకాలంలో స్టేషన్ల ఆధునీకరణతో కొత్తశోభను సంతరించుకొన్నాయి. ఇంతచేసినా ఊరిపేర్లు మాత్రం మార్చకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. వెంకటగిరి - గూడూరు మధ్యలో వెంకటగిరి దాటగానే వచ్చే స్టేషన్ నిడిగల్లు. నిజానికి ఈ స్టేషన్ నిడిగల్లుకి మూడు కిలోమీటర్ల దూరంలో కాట్రగుంట గ్రామ పరిధిలో వుంది. అప్పట్లో పెద్ద వ్యాపార కేంద్రమైన జయంపు గ్రామంలో స్టేషన్ ఏర్పాటుచేసినా వెందోడు స్టేషన్‌గా పేరు నమోదై వుండడంతో అయోమయం నెలకొనింది. వెందోడు గ్రామం గూడూరు మండల పరిధిలోకి వస్తుంది. వెంకటగిరి - శ్రీకాళహస్తి రైల్వే మార్గంలో వెంకటగిరికి సమీపాన అయిదు కిలోమీటర్ల దూరంలో వున్న యాతలూరు రైల్వేస్టేషన్ ఆనవాళ్లు కోల్పోతున్నది. ఒకనాడు ప్రయాణీకులతో కళకళలాడిన ఈ స్టేషన్ నేడు వెలవెలబోతుండడంతో దీనిని ఎత్తి వేశారు. ఇలా గ్రామం పేరు ఒకటి రైల్వేస్టేషన్ పేరు ఇంకొకటిగా వుండడం, పాత స్టేషన్లను రద్దు చేస్తుండడంతో ప్రజలు నిరసన తెలుపుతున్నారు.

సింగపేటలో సమస్యలెన్నో!

సమావేశం పెట్టి మూడేళ్లు

అల్లూరు మండలంలోని ఆదర్శ గ్రామ పంచాయితీ సింగపేట పేరు గొప్ప ఊరు దిబ్బగా తయారైందని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో మురుగునీటి కాలువలు లేక ప్రజలు అవస్థలు పడుతుంటే ఇంతవరకు కాలువల ఏర్పాటుకు ఎలాంటి చర్యలను పంచాయితీ తీసుకొనకపోవడంతోపాటు వీధి దీపాలు కాలిపోయినా వాటి స్థానంలో క్రొత్త వాటిని వేయించలేని స్థితి నెలకొనిందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో చర్చి దగ్గర రోడ్డు ఆక్రమణలకు గురైనా దానిని పట్టించుకొనేవారు లేకుండా పోయారని, మూడు సంత్సరాల నుంచి ఎలాంటి సాధారణ సమావేశం, పంచాయితీ సమావేశం జరిగిన దాఖలాలు లేవని వార్డు సభ్యులు చాగంటి కొండారెడ్డి, శ్యామ్యూల్, పెంచలయ్య, సన్యాసయ్యలు జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తక్షణం పంచాయితీలో సాధారణ సమావేశం ఏర్పాటు చేయడంతోపాటు గ్రామంలో మురికి కాలువలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దారికొస్తున్న మంత్రులు




రోశయ్యను వ్యతిరేకిస్తున్న మంత్రులంతా యిప్పుడు దారికొస్తున్నారు. రోశయ్యను గనక సిఎల్పీ నాయకుడిగా ఎన్నుకుంటే ఆయన మంత్రివర్గంలో ఒక్కక్షణం కూడా వుండమంటూ భీషణ ప్రతిజ్ఞ చేసిన కొండా సురేఖ, అహ్మదుల్లా, రామచంద్రారెడ్డి వంటి జగన్ మద్దతుదారులు ఒక్కొక్కరే తమ స్వరాల్ని మార్చుకుంటున్నారు. రోశయ్యను ముఖ్యమంత్రిగా కొనసాగించటానికే అధిష్టానం నిర్ణయించడంతో సమీప భవిష్యత్తులో జగన్ ముఖ్యమంత్రి అయ్యే అవకాశం అడుగంటింది. దీంతో తమ మంత్రి పదవుల్ని నిలుపుకోవడానికి గత్యంతరంలేక యిప్పుడు అధిష్టానం మాటే మామాట అంటూ మంత్రులు గొంతు మారుస్తున్నారు. రోశయ్య ముఖ్యమంత్రిగా పనికిరాడంటూ సమయం వచ్చినప్పుడల్లా స్టేట్‌మెంట్లు యిచ్చిన ఆనం రామనారాయణరెడ్డి కూడా ఇప్పుడు పనివున్నా లేకున్నా రోశయ్య చుట్టూ తిరుగుతున్నాడు. వైఎస్ కిచెన్ క్యాబినెట్‌గా వ్యవహరించిన రఘువీరా, వట్టి వసంతకుమార్, దానం నాగేందర్, ముఖేష్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ వంటివారు కూడా ప్రస్తుతం రోశయ్యను ప్రసన్నం చేసుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు.

దత్తన్న కొత్త ఖాతా షురూ!



ముఖ్యమంత్రులకు లేఖలు రాయడంలో బిజెపి నాయకుడు బండారు దత్తాత్రేయకు గిన్నీస్‌బుక్ అవార్డు యివ్వొచ్చంటున్నారు సిఎం కార్యాలయ సిబ్బంది. వైఎస్ సిఎంగా వున్నప్పుడు దత్తన్న మొత్తం 145 లేఖలు రాశాడు. అయితే ఒక్క లేఖకు కూడా జవాబు రాలేదనుకోండి. అది వేరే సంగతి. ప్రస్తుతం రాష్ట్రంలో సిఎం మారడంతో దత్తన్న తన పాత ఖాతాను మూసేసి, కొత్త సిఎంకు ఫ్రెష్‌గా ఉత్తరం రాశాడు. తను సిఎంకు ఉత్తరాలు రాసే పరంపరను కొనసాగిస్తానని, త్వరలోనే రెండవ ఉత్తరాన్ని కూడా సిఎంకు పంపుతున్నానని చెబుతున్నా మొత్తం మీద దత్తన్న ఉత్తరాల తాకిడిని తట్టుకోవడం సిఎం కార్యాలయానికి కొత్త సవాలే...! సో... సిఎం కార్యాలయ సిబ్బంది... తస్మాత్ జాగ్రత్త!

మంత్రిపదవిపై జెసి విరహితాపం



తనకు మంత్రిపదవి ఎప్పుడొస్తుందా! అని మాజీ మంత్రి జెసి.దివాకర్‌రెడ్డి నానా తపన పడుతున్నాడు. వైఎస్ సిఎంగా వున్నప్పుడే తనకు మంత్రిపదవి రావాల్సి వుండిందని, దురదృష్టం వల్ల ప్రమాదం జరగటంతో ఆలస్యమైందని జెసి అంటున్నాడు. రోశయ్య కూడా తనకు మంత్రి పదవిని యిస్తానని చెబుతున్నాడు కానీ... ఎప్పుడిస్తాడో మాత్రం అర్థంకావడం లేదని వాపోతున్నాడు. కనబడిన ఎమ్మెల్యేలు, పత్రికావిలేకరులకు తన పేరు సిఎంకు సిఫార్సు చేయమంటూ కోరుతున్నాడు. సిఎల్పీ కార్యాలయంలో అయితే జెసి వుంటే చాలు... మంత్రి పదవి గురించే చర్చ జరుగుతూవుంటుంది. మొత్తం మీద జెసి ఇక ఎంత మాత్రం వేచివుండే పరిస్థితి కనపడటం లేదు. రోశయ్య దయతలచి మంత్రి పదవి ఇస్తే సరి... లేకపోతే విరహతాపంతో జెసి వేగిపోవడం మేం చూడలేమంటున్నారు సిఎల్పీ కార్యాలయ సిబ్బంది.

కెవిపిపై తెదేపా 'గురి'



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు, వైఎస్ మిత్రుడు కెవిపి.రామచంద్రరావుపై తెలుగుదేశం పార్టీ గురిపెట్టింది. వైఎస్ సిఎంగా వున్నప్పుడు కెవిపిని పల్లెత్తుమాట కూడా అనని తెలుగుదేశం పార్టీ యిప్పుడు శస్త్రాస్త్రాలతో దండెత్తడానికి నడుం కట్టింది. ప్రభుత్వ సలహాదారుడిగా గత అయిదేళ్లగా కెవిపి ఏం చేశారంటూ ప్రశ్నించడమేగాక ఆయన ఆస్తులపై విచారణ జరిపించాలన్న డిమాండ్‌ను తెరపైకి తెస్తోంది. గత అయిదేళ్ల కెవిపి అక్రమ ఆర్జన ద్వారా వేల కోట్లు సంపాదించారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేయడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశం అయింది. వైఎస్ లేకపోవడం వల్ల కెవిపి రాజకీయంగా బలహీనపడ్డాడని, ఈ సమయంలో ఎదురుదాడి చేయడం ద్వారా రాజకీయ ప్రయోజనాన్ని పొందాలన్నది తెలుగుదేశం పార్టీ వ్యూహంగా కనబడుతోంది. అయితే దీనివల్ల ఒరిగేదేమీ లేదంటూ ఆ పార్టీ సీనియర్లు కొందరు పార్టీ కార్యాలయంలోనే బాహాటంగా చెప్పుకొంటున్నారు.

'పితాని' సమాచార లోపం




ముఖ్యమంత్రికి, ఆరోగ్యశ్రీమంత్రికి మధ్య ఏర్పడిన సమాచార లోపం వివాదాస్పదంగా మారింది. డెంగీ వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు సాక్షాత్తు ముఖ్యమంత్రి కార్యాలయం అధికారికంగా ఓ ప్రకటనను జారీ చేసింది.ఈ విషయం టివి ఛానెళ్లలో, వార్తాపత్రికల్లో ప్రముఖంగా ప్రచారమైంది కూడా. అయితే తనకు ఈ విషయం తెలియదని, డెంగీని ఆరోగ్యశ్రీలో చేర్చే ప్రతిపాదన ఏదీలేదంటూ ఆ శాఖామంత్రి పితాని సత్యనారాయణ ప్రకటించారు. పైగా డెంగీని ఆరోగ్యశ్రీలో చేర్చడం అంత సులువు కూడా కాదంటూ వాదిస్తున్నాడు. ఇది కాస్తా ముఖ్యమంత్రి దాకా వెళ్లింది. పితానిని పిలిచి ముఖ్యమంత్రి సుతిమెత్తగా మందలించాడని అంటు న్నారు. పితాని వైఎస్.జగన్ మద్దతుదారుడు కావడం వల్లనే సిఎం అన్నా ఆయన మాట అన్నా లెక్కలేకుండా వుందని సచివాలయం అధికారులు చెవులు కొరుక్కొంటున్నారు.

ఎస్వీ ప్రసాద్‌కు లైన్‌క్లియర్



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవికి ఎస్వీప్రసాద్‌కు లైన్‌క్లియర్ అయింది. ప్రస్తుతం సిఎల్ఆర్‌గా వున్న ఎస్వీప్రసాద్‌కు ప్రత్యేక ప్రధానకార్యదర్శిగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రమాకాంత్‌రెడ్డి గతనెల రిటైర్ అయ్యారు. అయితే ప్రభుత్వ అభ్యర్థనపై ఆయనకు మూడు నెలలు సర్వీసు పొడిగించారు. ఆ తర్వాత రెగ్యులర్ సెక్రటరీని నియమించుకోవాలని రోశయ్య భావిస్తున్నారు. ఎస్వీప్రసాద్ గతంలో ముగ్గురు ముఖ్యమంత్రుల దగ్గర ముఖ్యకార్యదర్శిగా పనిచేశాడు. సౌమ్యుడు, లౌక్యుడుగా ఎస్వీకి మంచిపేరుంది. అందుకే ఎస్వీప్రసాద్‌ను ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా నియమించాలని రోశయ్య నిర్ణయించుకున్నారని అంటున్నారు. దాన్లో భాగంగానే ఎస్వీకి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ప్రమోషన్ యిచ్చారట. సో... ఎస్వీను త్వరలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా చూడడం ఖాయమని సచివాలయ వర్గాలంటున్నాయి.

మంత్రుల మూకుమ్మడి రాజీనామాలు



రాష్ట్ర మంత్రివర్గాన్ని విస్తరించడానికి వీలుగా త్వరలో మంత్రులంతా మూకుమ్మడి రాజీనామా చేయనున్నారన్న వార్త సచివాలయంలో గుప్పుమంటోంది. రోశయ్య ముఖ్యమంత్రి అయ్యాక మంత్రివర్గంలో మార్పులు - చేర్పులు వుంటాయని భావిస్తున్న నేపథ్యంలో ఆయనకు ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. ఢిల్లీ వెళ్లి వచ్చాక రోశయ్య మంత్రులందర్నీ రాజీనామా చేయమని కోరతారట. ఆ తర్వాత జరిగే సిఎల్పి సమావేశంలో రోశయ్యను నాయకుడిగా ఎన్నుకుంటారు. మరుసటి రోజునే రోశయ్య తన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకుంటారట. ఇన్నాళ్లు జగన్‌కు మద్దతుగా రోశయ్యను వ్యతిరేకిస్తున్న చాలామంది మంత్రుల పేర్లు గల్లంతు కావడం ఖాయమంటున్నారు. రోశయ్య తనకు విధేయులైన వారికే పెద్ద పీట వెయ్యొచ్చన్నది అభిజ్ఞవర్గాల ఉవాచ. దీంతో పలువురు మంత్రులకు కంటిమీద కునుకు కరువైంది. రోశయ్య మంత్రివర్గంలో తాము వుంటామో, లేదో తెలీక మదనపడుతున్నవారి సంఖ్య రోజురోజుకూ ఎక్కువ అవుతోంది.

రాహుకాల పూజలతో గ్రహదోషాలు తొలగుతాయి!



నెల్లూరు నగరంలోని దేవాలయాల్లో పలురకాల పూజలు జరుగుతుంటాయి. అధికసంఖ్యలో భక్తులు వివిధ పూజా కార్యక్రమాల్లో పాల్గొని భగవంతుని భక్తి శ్రద్ధలతో పూజిస్తుంటారు. ముఖ్యంగా దర్గామిట్టలో కొలువై వుండే రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జరిగే రాహుకాల పూజలకు విశేష ప్రాధాన్యముంది. ప్రతి ఒక్కరి జీవితాలపై గ్రహాల ప్రభావం అనేది ఎంతో కొంత వుంటుందనేది పలువురు పండితుల అభిప్రాయం. ఆయా గ్రహాల దోషాల వల్ల చికాకులు, అనుకొన్న పనులు జరగకపోవడం, ఆటంకాలు ఎదురవడం, సమస్యలు చుట్టుముట్టడం లాంటివి ఎదురౌతుంటాయని పండితులు చెప్తుంటారు. అలాంటి సమస్యల నుంచి బయటపడేందుకు రాహుకాల పూజలు చేసుకొన్న ట్లయితే మంచి జరుగుతుందనే నమ్మకంతో అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ పూజలు జరిపించుకొంటుంటారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు రాహుకాల సమయంలో రాహు, కేతువులకు పూజ చేయడం ద్వారా గ్రహదోషాలు తొలగుతాయని నమ్మకం. ఈ పూజ చేయించుకోవాలని భావించేవారు నిమ్మకాయలు, నెయ్యి, ఎర్రని వస్త్రాన్ని తీసుకొని వచ్చి అధి దేవత అయిన అమ్మవారిని పూజించాల్సి వుంటుంది. నిమ్మకాయలో నెయ్యిపోసి దీపం వెలిగించి చేసే పూజ వల్ల సంతానప్రాప్తి, వివాహ నిశ్చయం, ఉద్యోగం, వ్యాపారవృద్ధి కలుగుతుందని ఆలయ అర్చకులు చెబుతున్నారు. మొదట్లో శుక్రవారం నాడు మాత్రమే ఈ రాహుకాల పూజలను చేసేవారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజలు జరిపించుకొంటుండడంతో మంగళవారం మధ్యాహ్నం 3.00 గంటల నుండి 4.30 గంటల సమయంలోనూ ఈ పూజలు చేస్తున్నారు. ఈ పూజలు చేయడం వల్ల దోషాలు తొలగి శుభాలు కల్గుతున్నాయని పలువురు భక్తులు అభిప్రాయ పడుతున్నారు.




ట్రంకురోడ్డు కబుర్లు

'శ్రీ' దే గెలుపు!



నెల్లూరు నగర ప్రజల ఆరాధ్యదేవత రాజరాజేశ్వరమ్మ తన కోవెల ముంగిట బార్ పెట్టాలనుకొన్న దుర్మార్గుల మనసు మార్చలేకపోయింది. పురపాలిక భానుశ్రీ దేవస్థానం ప్రక్కనే తన అనుచరుల చేత బార్ లైసెన్సుకు దరఖాస్తు చేయించింది. రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డికి కనపడని దేవతకన్నా కనుల ముందు కనిపించే 'శ్రీ' కోరిన కోర్కె ముఖ్యమయ్యింది. అన్ని పార్టీలు ధర్నాలు చేసినా, స్వపక్షంలో విపక్షంలా ఈ ప్రాంత కార్పొరేటర్ సన్నపురెడ్డి హాహాకారాలు చేసినా అవన్నీ గాలిలో కలిశాయి. బార్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఉత్తర్వులు తీసుకొని ఎక్సైజ్ అధికారులు మేయరమ్మ వాకిట ముందు నిలిచారు. ఇక రాజేశ్వరమ్మ భక్తులకు ఎవరు రక్ష?

నాగిని ఇంటికి నాగు



నెల్లూరు నగరంలో ఈ మధ్య నాగుపాముల సంచారం ఎక్కువై పోయింది. ఎక్కడ పడితే అక్కడ పెనవేసుకొని కనపడుతున్నాయి. గతవారం నాగుల చవితి పండుగరోజు నజీర్ తోటలో నాగిని అనే పేరు గల భక్తురాలింటికి ఓ నాగుపాము వెళ్లింది. అనుకోని అతిథి తన ఇంటికి రావడంతో నాగిని చుట్టుప్రక్కలవాళ్లకు ఈ సమాచారం చెప్పడంతో వాళ్లు పాముకు పూజలు, పునస్కారాలు గట్రా మొదలుపెట్టారు. గుడ్లు, పాలు ముందు పెట్టడంతో సుష్టుగా తిని భుక్తాయాసంలో పడ్డ నాగును స్థానిక యువకులు బస్తాలో బంధించి పెన్నానదిలో విడిచిపెట్టి వచ్చారు.

అక్రమార్కులను పట్టిస్తే కమీషన్




నెల్లూరు మీదుగా వెళ్లే ఐదవ నెంబర్ జాతీయ రహదారిపై ఇటీవల బియ్యం, ఇసుక, బొరన్‌ఓర్, నిత్యావసరాలు, గ్రానైట్‌ల స్మగ్లింగ్ పెచ్చు పెరిగింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అక్రమార్కుల భరతం పట్టలేక చతికిల పడింది. దీంతో ఈ శాఖాధికారులకు మెరుపులా మదిలో ఓ ఆలోచన మెదిలింది. అక్రమ రవాణా, బ్లాక్ మార్కెటింగ్‌పై ప్రజలు తమకు సమాచారం అందిస్తే పట్టుకొన్న సరకు మొత్తంలో రెండు శాతం కమీషన్‌గా సమాచారం ఇచ్చిన వారికిస్తామని ప్రకటించారు ఈ శాఖాధికారులు. ఈ కమీషన్ వ్యాపారానికి ఎటువంటి స్పందన వుంటుందో చూడాలిమరి!

చేసిన తప్పులు దిద్దుకోలేనివి?



సమయోచిత నటనలో రాష్ట్రంలోని ఎమ్మెల్యేందరూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి ముందు దిగతుడుపేనని చెప్పాలి. కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తుండడంతో వివేకానందరెడ్డి మాటలు, చేష్టలు మారిన విషయం పార్టీ కార్యకర్తలు బాగా గమనిస్తున్నారు. గతవారం ఆనంవారి వీధిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ గత కార్పొరేషన్ ఎన్నికల్లో నిజమైన పార్టీ కార్యకర్తలకు టిక్కెట్లు ఇవ్వక ఎవరెవరికో ఇచ్చాను. ఈసారి అలా చేయను. పార్టీకి కష్టకాలంలో జెండాలు మోసిన వారికే ఇస్తాను. అసలు నేను చేసిన తప్పులు తలనేలకేసి కొట్టుకొన్నా సరిదిద్దుకోలేనివనదంతో వివేకా వ్యవహారశైలి తెలిసినవాళ్లు నోరెళ్ల బెట్టారు.

కుట్ర పత్రికై!



రాజీవ్‌గాంధీ హత్యోదంతంపై నటి రోజా భర్త సెల్వమణి తీసిన ఈ రిలీజ్ కాని సినిమా 'కుట్ర పత్రికై' ప్రేక్షకులకు గుర్తుండే వుంటుంది. సాక్షి పత్రికలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ మరణం వెనుక ఏదో కుట్ర వుందని వార్త రావడంతో జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ మధ్య మూగబోయిన గొంతును ఒక్కసారిగా సవరించుకొని మీడియా ముందుకు వచ్చారు. ఈ కుట్ర ఎవరు చేశారు? ఎందుకు చేశారు? సిఎం హత్య విషయం జగన్, రోశయ్యల స్వంత వ్యవహారం కాదు. హెలికాప్టర్ బ్లాక్ బాక్సులో రికార్డయిన అంశాలను బయటపెట్టాలని ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించారు. కాని సోమిరెడ్డి కామెంట్స్‌కు కౌంటర్ ఇచ్చే ఎమ్మెల్యే వివేకా 'కుట్రపత్రికై' వ్యవహారంలో నోరే మెదపలేదు.

మేషం
అశ్విని, భరణి, కృత్తిక 1 పా

చెవి, గొంతు, ఊపిరితిత్తులు, కిడ్నీలకు సంబంధించిన బాధలుంటాయి. ఆరోగ్య విషయంలో అతి జాగ్రత్త అవసరం. ఋతు సంబంధిత బాధలుంటాయి. కుటుంబంలో ఆందోళనకు అవకాశాలు. ఆర్థిక విషయాల్లో కొంతమేలు. అప్పులు పుడుతాయి. ఇతరులతో శత్రుత్వం తొలుగుతుంది. వ్యాపారులు భాగస్వాములు, పనివాళ్లవల్ల మోసపోయే అవకాశాలున్నాయి.

వృషభం
కృత్తిక 2,3,4 పా, రోహిణి, మృగ 1,2 పా

వృత్తిలో గొడవలు అధికం. చుట్టూ వున్న వారు సరిగా అవగాహన చేసుకోరు. నూతన ఒప్పందాలు చేసుకొంటారు. కీళ్ల నొప్పులు, కడుపునొప్పి బాధ తగ్గవచ్చు. కళత్ర సుఖలోపం వుంటుంది. వైద్యసేవలో మందులు సేవించడంలో జాగ్రత్త. వాహనాలవల్ల నష్టం అధికం. చిన్న చిన్న స్పర్ధలుంటాయి. వ్యాపారులు సేవకుల విషయంలో అతి జాగ్రత్త వహించాలి.

మిథునం
మృగ 3,4 పా, ఆరుద్ర, పునర్వసు 1,2,3 పా

ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా వుండాలి. బి.పి, హృదయ సంబంధ రోగాలుండవచ్చు. నిద్రలేమి ఉండవచ్చు. కుటుంబసభ్యులతో గొడవలుంటాయి. కళత్ర సంబంధాలు దెబ్బతినవచ్చు. అవగాహనలోపం ఇబ్బందికరంగా వుంటుంది. దబ్బు విషయంలో ఆటంకాలు. వ్యాపారులకు ఆదాయం తగ్గుతుంది. భాగస్వాములతో జాగ్రత్త. వృత్తిపరులకు గట్టిపోటీ.

కర్కాటకం
పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష

వివిధ రకాల అనారోగ్య ఇబ్బందులుంటాయి. ఎదురుచూసిన డబ్బు చేతికందదు. మహాత్ముల ఆశీస్సులు లభిస్తాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం కలసివస్తుంది. సోదరులతో విరోధం ఏర్పడవచ్చు. వ్యాపారరంగంలోని వారికి బాగుంటుంది. కొత్త ఒప్పందాలు చేసుకొంటారు. ఉద్యోగంలో భారం ఎక్కువ. భార్యాభర్తల మధ్య సంబంధం చక్కగా వుండదు. లావాదేవీలు జాగ్రత్త.

సింహం
మఖ, పుబ్బ, ఉత్తర 1 పా

పుణ్య కార్యక్రమాల్లో పాల్గొంటారు. భార్యాభర్తల సంబంధం చక్కగా వుంటుంది. కళత్ర సహాయం బాగుంటుంది.సంతానం అనారోగ్యం ఆందోళనకరం. ధనాదాయ విషయంలో ఎలాంటి లోటుండదు. స్పెక్యులేషన్ లాభిస్తుంది. భాగస్వామ్యం చక్కగా కలసివస్తుంది. వృత్తిపరులకు కళాకారులకు మేలైన కాలం. ఉద్యోగులకు విరోధులు అణిగి వుంటారు. విద్యార్థులకు మంచి సమయం.

కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్త 1, 2 పా

బి.పి, వత్తిడికి సంబంధించిన అనారోగ్య బాధలుండవచ్చు. కళత్ర సంబంధాలు చక్కగా వుంటాయి. సంతానం అనారోగ్య బాధలు ఇబ్బందికరంగా వుంటాయి. నూతన ధనాదాయావకాశాలు సూచితం. ఖర్చులధికం. స్పెక్యులేషన్ జోలికి వెళ్లవద్దు. భాగస్వామ్యాలు చక్కగా లాభిస్తాయి. వృత్తిపరులకు మంచి లాభావకాశాలు. రాజకీయులకు ప్రోత్సాహకరమైన కాలం. గృహిణులకు పనిభారం.

వారఫలాలు

తేది 31-10-2009 నుండి 6-11-2009 వరకు

తులలో రవి, బుధులు; కర్కాటకంలో కుజ, కేతువులు; మకరంలో గురువు; మకర, కుంభాల్లో రాహువు; కన్య, తులల్లో శుక్రుడు; మీన, మేష, వృషభ, మిథునాల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

31 శని త్రయోదశి.
1 ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం.
2 కార్తీక పూర్ణిమ, గురునానక్ జయంతి.

శుభముహూర్తాలు

31,1 తేదీల్లో రా.7.00 గం.ల నుండి 8.00 గం.ల వరకు వృషభలగ్నాన
1,4 తేదీల్లో రా.1.30 గం.ల నుండి 2.30 గం.ల వరకు సింహలగ్నాన
2 తేదీ రా.7.00 గం.ల నుండి 8.00 గం.ల వరకు వృశ్చికలగ్నాన
4 తేదీ రా.9.00 గం.ల నుండి 11.00 గం.ల వరకు మిథునలగ్నాన
శుభముహూర్తాలు వున్నాయి.

అక్టోబరు, నవంబరు తిథులు

కార్తీక శుద్ధ

31 శని	త్రయోదశి	రా.2.22	గం.ల.వ
1 ఆది	చతుర్దశి	రా.1.46	గం.ల.వ
2 సోమ	పూర్ణిమ	రా.12.37	గం.ల.వ

కార్తీక బహుళ

3	మంగళ	పాడ్యమి	రా.11.01	గం.ల.వ
4	బుధ	విదియ	రా.9.06	గం.ల.వ
5	గురు	తదియ	రా.6.59	గం.ల.వ
6	శుక్ర	చవితి	సా.4.47	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు - 1.
E-mail:maripmgg@yahoo.com

తుల
చిత్త 3, 4 పా, స్వాతి, విశాఖ 1, 2, 3 పా

వివిధరకాలైన అనారోగ్య బాధలుంటాయి. గృహనిర్మాణ కార్యాలు పూర్తిచేస్తారు. మిత్రుల సాయం ఉంటుంది. భార్యాభర్తల మధ్య గొడవలుంటాయి. వృత్తిలో సమస్యలుంటాయి. సంతాన మూలక ఆనందం బాగుంటుంది. కుటుంబంలో శుభకార్యాలు జరుగవచ్చు. శరీరారోగ్యం బాగుంటుంది. ప్రయత్నాలన్నీ సఫలమవుతాయి. లావాదేవీలు లాభిస్తాయి. అప్పులు తీరుస్తారు.

వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జ్యేష్ఠ

సంతానమూలక సుఖం అధికమవుతుంది. ధనాదాయం ఊహించినంతకంటే ఎక్కువ. కుటుంబసభ్యుల మధ్య ఉత్సాహం పెల్లుబుకుతుంది. కళత్ర సంబంధం చక్కగా వుంటుంది. విందు వినోదాల్లో పాల్గొంటారు. చాటుమాటు విరోధాలు తొలగిపోతాయి. దైవపూజ కార్యక్రమాల్లో పాల్గొంటారు. రియల్‌ఎస్టేట్ పనులు సాధ్యమవుతాయి. విదేశ వ్యాపారాలు లాభిస్తాయి.

ధనస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

ఆంత్ర సంబంధిత అనారోగ్య పరిస్థితులు అధికం. దీర్ఘకాలిక రోగులకు శస్త్రచికిత్స అవకాశాలు. బంధుమిత్రులతో కొంతమేలు. కళత్ర సంబంధాలు కొద్దిగా దెబ్బతింటాయి. సంతానమూలక ఇబ్బందులు. ఎదురుచూసిన తావుల నుండి అప్పులు ముడుతాయి. ధనాదాయం తృప్తికరం. వ్యాపారులు, భాగస్వాముల నుండి మోసపోయే అవకాశాలు. పోటీలు అధికం.

మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

కొత్త పరిచయాలు ఏర్పడతాయి. కంటికి సంబంధించిన ఇబ్బందులు. ఇతరుల సాయం లభించదు. సోదరుల మూలంగా కష్టాలు. రాని బాకీలు తిరిగి వస్తాయి. ఊహించని ధనాదాయం వల్ల వస్తువులు, ఆభరణాలు కొంటారు. బంధుమిత్రుల సహకారం వుంటుంది. వృత్తిలో గౌరవ, మర్యాదలు దక్కుతాయి. దొంగదాటు శత్రువులుంటారు. అధికారుల సాయం అందివస్తుంది.

కుంభం
ధనిష్ఠ 3,4 పా, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పా

దైవకార్యాల్లో పాల్గొంటారు. సంతానం ప్రవర్తన బాధ కలుగచేస్తుంది. ఎదురుచూచిన మార్గాల గుండా ధనప్రాప్తి, ఋణప్రాప్తి. కుటుంబసభ్యుల మధ్య సత్సంబంధాలుంటాయి. ధనాదాయం చాలా తృప్తికరంగా వుంటుంది. సోదరులు చేయందిస్తారు. స్పెక్యులేషన్ లాభించవచ్చు. వ్యాపారులకంత మంచి కాలం కాదు. పోటీలెక్కువ. వృత్తిపరులకు అడ్డంకులు ఎక్కువ.

మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

భార్యాభర్తల మధ్య పరస్పర అవగాహన వుంటుంది. చిన్న చిన్న అనారోగ్య సమస్యలే. బి.పి వున్న వారు జాగ్రత్తగా మెలగాలి. జీవ శక్తి తగ్గుతుంది. ధనాదాయ విషయాలు చక్కగా వుంటాయి. సమాజంలో హోదా పెరిగే అవకాశాలు. కళత్రసంబంధాలు చక్కగా వుంటాయి. నూతన మిత్రుల పరిచయం. వ్యాపారులకు చాలా మంచికాలం. కొత్తపెట్టుబడులకు మంచికాలం.

వాస్తులో గ్రహ ఫలితాలు, దుష్ట ప్రభావాలు!

ఏ.వి.కె.ఉమాశంకరశర్మ నెల్లూరు

** అమ్మాయికి వివాహమై ఏడాది అయింది. ఈలోగా కుటుంబ కలతల వల్ల విడిపోవడం జరిగింది. కారణమేమిటి?*

వాస్తు ప్లాను, జాతకం విశ్లేషించాక ఆగ్నేయం బ్లాకులో దక్షిణ లోపాల వల్ల కుజ (అంగారక) స్థానం దుష్ట ప్రభావాల్ని చూపింది. రాహుస్థానం నీచస్థానం కావడం వల్ల సాంసారిక కల్లోలం అనివార్యమయింది.

ఇంద్రప్రభ పెన్నూరు రాజమండ్రి

** చతుష్షష్టి పద విభజనలో ఈశాన్యం నైరుతి గదులను ఏ రాశులు ఆవహించి వుంటాయి.*

ఈశాన్యం మీనం, నైరుతి కన్యారాశులు నివాసం వుంటాయి.

పార్వతి టంకం తడ

** చదువులోనూ, అందచందాలలోనూ అందరూ మెచ్చుకొనే అమ్మాయి అనారోగ్యం పాలబడింది.*

ఇది చేతబడి ఏమాత్రం కాదు. ఉత్తర వాయువ్యంలోని సెప్టిక్‌ట్యాంకును వెంటనే తొలగించండి. శక్తియంత్ర ప్రతిష్ట చేయండి.

దశరధి వితల ఉదయగిరి

** ఇంటిప్లాను పంపిస్తున్నాను. మా ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులకు కారణం ఏమిటి?*

ప్లాను వాస్తు దోషభూయిష్ఠంగా వుంది. ఉత్తర వాయువ్యం గేటును ఈశాన్యానికి మార్చండి. గృహ నైరుతి పెరిగింది. వెంటనే లక్ష్మీకృత వాస్తుయంత్ర ప్రతిష్ట చేయించండి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్ట్, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

పద్మావతి కోట శ్రీకాళహస్తి

** పశ్చిమం అంగళ్లు, తూర్పు ఇల్లు నిర్మాణం తర్వాత శ్రీవారి ఆరోగ్యం దెబ్బతింది.*

పశ్చిమం యజమానిపై ప్రభావం చూపిస్తుంది. పశ్చిమం అంగళ్ళకు తూర్పు ఇల్లు 'పిడిశా' నిర్మాణమయింది. అందువల్ల యజమాని అనారోగ్యవంతుడయ్యాడు.

నాగేశ్వరరావు రమాపతి సూళ్లూరుపేట

** నాది మేషరాశి. నాకు ఏ ఇల్లుకలిసి వస్తుంది?*

అధిపతి కుజుడు. ఈ రాశివారు స్త్రీలైతే దక్షిణం, పురుషులైతే ఉత్తరం నపుంసక స్థానం గనుక తూర్పు కలిసి వస్తుంది.

ఆర్.లక్ష్మీసువర్చల గూడూరు

** పశ్చిమం యిల్లు. వాయువ్యంలో సెప్టిక్‌ట్యాంకు వుంది. పడమర స్థలం పెరిగింది.*

పశ్చిమం చాలా జాగ్రత్తగా వుండాలి. వాయువ్యం అగాధమై చంద్రస్థానం నీచమై మానసిక వత్తిడులు పెరుగుతాయి. శనిస్థానం (నపుంసకం) కాబట్టి పడమర దోషాలతో కలుస్తాయి. మీరా యింటిలో నిలువలేరు.

అనంతరావు టి.వి ఆత్మకూరు

** వాయువ్యం వంటగది నిర్మాణం చేశాము. లోపాలు చెప్పండి?*

ప్లాను ప్రకారం ఆగ్నేయం రహదారి గనుక వాయువ్య వంటగది ప్రత్యామ్నాయమే. అయితే వాయువ్యం సెప్టిక్‌ట్యాంకు నిషిద్ధం.

"ఆమె".

ఆమె మెరిసే కురులు నలుపు
విరిసే నవ్వు ప్రేమ గెలుపు -

కైపు కళ్ల కాటుక రేకలు
ఎగిసే నెగళ్ల కాంతి వాట్లు -

ఆమె ఓయ్ అని పిలిచింది
మనసు హాయ్ అనిపించింది -

ఆమె వోరగా చూసింది
ప్రేమ దోరగా పండింది -

వచ్చీరాని వయసు మొలగొలుకులు
నచ్చీనచ్చక నడక మొలకులుకులు -

పచ్చిక మీద ఆమె పాదాలు
తేనెలూరుతూ ఆమె పెదాలు -

ఆమెను చూడకపోతే విరహం
మదిలే ప్రేమ ప్రవాహం -

కదిలే ఆమెచీర కుచ్చిళ్లు
స్వర్గానికి తొలితొలి వాకిళ్లు -

ప్రేమను వెలిగించే నా శ్వాస
ఆమె నాలో రగిలించెను ఆశ -

ఆమె లాగి విడిచిన బాణం
ప్రేమతో విలవిల నా ప్రాణం -

-జయంపు కృష్ణ, హైదరాబాద్.

పొదలకూరులో త్రాగునీటికి కటకట!

అంతగట్లో అన్నీవున్నా అల్లుడినోట్లో శని వుందన్న సామెతను గుర్తుకు తెస్తుంది పొదలకూరు పంచాయితీ. పొదలకూరుకు సమీపంలోనే కండలేరు జలాశయం వున్నా ఇక్కడ మాత్రం త్రాగునీటికి ప్రజలు కటకటలాడుతున్నారు. కండలేరు జలాశయం నుంచి పొదలకూరు పంచాయితీకి త్రాగునీటి సరఫరా కోసం పైపులైన్లు వేసినప్పటికి త్రాగునీరు మాత్రం అందడం లేదు. పంచాయితీ పరిధిలో వేసిన త్రాగునీటి బోర్లు సైతం మరమ్మత్తులకు గురై వున్నాయి.

మేజర్ పంచాయితీగా పేరొందిన పొదలకూరు పంచాయితీ పరిధిలో దాదాపు 18 వేల జనాభా, 14వేల మంది ఓటర్లు; 3,500 కుటుంబాలు వున్నాయి. ప్రజల నుంచి ప్రతి సంవత్సరం వివిధ పన్నుల రూపంలో తొమ్మిది లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. పంచాయితీ పాలకవర్గంలో తలెత్తిన చిన్నపాటి విబేధాల కారణంగా అభివృద్ధికి నోచుకోలేకపోయినట్లు కనిపిస్తుంది. ప్రస్తుత సర్పంచ్ గ్రోసు శ్యామలమ్మ తెలుగుదేశం పార్టీకి చెందిన వారు కావడం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండడం కారణంగా ఆశించిన మేర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడం లేదు.

సర్పంచ్ మహిళ కావడం వలన పంచాయితీ పరిధిలో చేపట్టాల్సిన పనుల గురించి తిరిగి తెలుసుకోలేకపోతున్నారు. ఈమె ఇటీవల కాలంగా గ్రామ పంచాయితీ కార్యాలయానికి కూడా సక్రమంగా రావడం లేదని స్థానికులు అంటున్నారు. ఉపసర్పంచ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో కొంతమేర పంచాయితీలో పనులు జరుగుతున్నాయి. ఎస్ఎఫ్‌సి నిధులు 8లక్షల రూపాయలు, 12వ ఆర్థిక సంఘం నిధులు 2లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రావెల్‌రోడ్ల నిర్మాణం, పైపులైన్ల ఏర్పాటు, డ్రైనేజి కాల్వల నిర్మాణం చేపడుతున్నారు.

పొదలకూరులో పారిశుద్ధ్యం కూడా చాలా అధ్వాన్నంగా వుంది. డ్రైనేజి కాల్వలను శుభ్రం చేయకపోవడంతో పందులు చేరి స్వైర విహారం చేస్తున్నాయి. పారిశుధ్య సిబ్బంది 13 మందిని నియమించుకున్నప్పటికి వీరిలో కొద్దిమంది మాత్రమే విధులకు హాజరవుతుండగా మిగిలిన సిబ్బంది పనికి ఎగనామం పెడుతుంటారు. ఈ నేపథ్యంలో పంచాయితీలోని సమస్యలపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలు ప్రక్కనిస్తున్నాం.



పొదలకూరు పంచాయితీ కార్యాలయం.



పారిశుద్ధ్యం అధ్వాన్నం

పంచాయితీ పరిధిలో పారిశుద్ధ్యం చాలా అధ్వాన్నంగా వుంది. గ్రామ పంచాయితీ సర్పంచ్ సమస్యలపై సరైన దృష్టి సారించకపోవడం కారణంగా ఇటువంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. జడ్పీ ఛైర్మన్ సహకారంతో కొంతమేర నిధులు మంజూరు చేయించి రోడ్లు, పైపులైన్లు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం పంచాయితీలో త్రాగునీటి సమస్య తీవ్రంగా వుంది. అధికారులు స్పందించి కండలేరు జలాశయం నుంచి నేరుగా పొదలకూరుకు నీటి సరఫరా చేయాలి.

– హరిబాబు, ఉపసర్పంచ్, పొదలకూరు పంచాయితీ



త్రాగునీటి కొరత తీర్చాలి!

పంచాయితీలో త్రాగునీటి సమస్య తీవ్రంగా వుంది. కండలేరు జలాశయం నుంచి త్రాగునీటి సరఫరాకు వేసిన పైపులైన్ల లీకేజీలు అధికంగా వున్నాయి. అంతేకాకుండా పై గ్రామాల ప్రజలు నీటిని ముందుగా వినియోగించుకోవడంతో పొదలకూరుకు నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఇక్కడి ప్రజలు ఇబ్బంది పడక తప్పడం లేదు. పాలకవర్గంతోపాటు జిల్లాస్థాయి అధికారులు స్పందించి త్రాగునీటి కొరత తీర్చాలి.

– చెన్నయ్య, స్థానికుడు

అవినీతి కథ

శ్రీదేవి కాలనీ స్థలాల కబ్జాకు యత్నం!

కార్పొరేటర్ సన్నపురెడ్డి పెంచలరెడ్డి సహకారంతోనే దుస్సాహసం.

నెల్లూరు నగరంలో ఇటీవల కాలంలో భూఆక్రమణలు ఎక్కువయ్యాయి. భూకబ్జాదారులకు అన్ని విధాలుగా సహాయసహకారాలు అందుతుండడంతో తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ నేతలు, రెవెన్యూ అధికారులు చివరకు పోలీసులు కూడా భూకబ్జాదారులకు వత్తాసు పలకడం వలన సామాన్య మధ్యతరగతి ప్రజలు హడలిపోతున్నారు. భూకబ్జాదారుల కన్ను పడిందంటే పట్టా, రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఏ ప్లాటైనా స్వంతం కావాల్సిందే.

దీనికి ఉదాహరణగా నెల్లూరు శివారున అనగుంట సమీపంలో వున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నగర్‌ను పేర్కొనవచ్చు. ఈ ప్రాంతంలో 1988 సంవత్సరంలో దాదాపు 40 మంది ప్లాట్లను కొనుగోలు చేయడం జరిగింది. పేద, మధ్యతరగతికి చెందిన వీరు ఒక్కో ప్లాట్‌ను 11,500 రూపాయలకు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకొని ఈ ప్రాంతానికి శ్రీదేవి కాలనీగా నామకరణం చేసుకొన్నారు. ప్రస్తుతం ఈ ప్లాట్లకు లక్షల్లో ధర రావడంతో గతంలో ప్లాట్లను విక్రయించిన వారిలో కొందరు వీటిని తిరిగి కబ్జా చేస్తున్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన విజయరాజ్‌కుమార్ అనేవ్యక్తి మరో ముగ్గురు కలిసి ప్లాట్లను ఆక్రమించి రేకుల షెడ్లను కూడా వేశారు.

పైసా, పైసా కూడబెట్టి ప్లాట్లను కొనుగోలు చేసినవారు భూకబ్జాదారులు చేస్తున్న ఆక్రమణలను అడ్డుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేసినా వారు ఏ మాత్రం స్పందించకపోగా ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లను నిబంధనల ప్రకారం ఇతరులు ఆక్రమిస్తే వారిపైన చర్యలు తీసుకోవచ్చు. ఇందుకు సంబంధించి నెల్లూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బాధితులకు స్టే కూడా మంజూరు చేసి వుంది. కోర్టు ఇచ్చిన స్టేను పోలీసులకు చూపించినా కూడా అసలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణ వుంది. శ్రీదేవి కాలనీలో ప్లాట్లు ఎక్కడ చేజారిపోతాయోనని బాధితులు లబోదిబోమంటూ అందరి చుట్టూ తిరుగుతున్నారు.



వివాదాల్లో నలుగుతున్న శ్రీదేవికాలనీ.

రిజిస్ట్రేషన్ చేయించిన ప్లాట్లలో అక్రమ కట్టడాలు నిర్మించడంలో వెనుక 27వ డివిజన్ కార్పొరేటర్ సన్నపురెడ్డి పెంచలరెడ్డి ప్రమేయం వుందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఆక్రమించిన ప్లాట్లలో సగభాగం కార్పొరేటర్‌కు ఇచ్చే విధంగా ముందస్తు ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. కార్పొరేటర్ తన అధికార, రాజకీయ పలుకుబడి వుపయోగించి రెవెన్యూ, పోలీసులు అటువైపు వెళ్లనీయకుండా చేస్తున్నారు. భూకబ్జాదారులకు అన్ని విధాలుగా మద్దతు లభిస్తున్నది. చట్ట ప్రకారం ప్లాట్లను కొనుగోలు చేసిన వారి పరిస్థితి మాత్రం చాలా దయనీయంగా వుంది.



అక్రమ కట్టడాలు

చట్టబద్ధంగా కొనుగోలు చేసిన ఇళ్లప్లాట్లలో అక్రమంగా భూకబ్జాదారులు కట్టడాలు నిర్మిందారు. ప్రకాశం జిల్లాకు చెందిన విజయరాజ్‌కుమార్ అనేవ్యక్తి ఈ కట్టడాల నిర్మాణం చేపట్టారు. మా ప్లాట్లలో కట్టడాలు ఎలా నిర్మిస్తారని ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నారు. పోలీసులకు విన్నవించుకున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

హజరత్తయ్య



దౌర్జన్యం చేస్తున్నారు!

పది సంవత్సరాల క్రితం శ్రీదేవి కాలనీలో ప్లాట్లను కొనుగోలు చేశాం. ప్రస్తుతం ఈ ప్లాట్లకు అధిక ధరలు రావడంతో నగరానికి చెందిన కార్పొరేటర్ సన్నపురెడ్డి పెంచలరెడ్డి సహకారంతో భూకబ్జాదారుడు విజయరాజ్‌కుమార్ ఆక్రమించి రాత్రికిరాత్రే కట్టడాలు చేపట్టాడు. రాజకీయ బలంలేని మేము వారిని ఎదుర్కొలేక మౌనంగా వుండాల్సి వస్తున్నది.

ప్రసాదరావు

అప'జయాభవ'!

అల్లూరు రమేష్

నాలుగైదు పాత సినిమాల క్యాసెట్లు ముందేసుకొంటే ఓ చిత్ర కథను ఎవరైనా తయారు చేయవచ్చు. బిల్లా, రెడీ చిత్రాల్లోని సన్నివేశాలకు కాసింత ట్రీట్‌మెంట్ ఇచ్చి ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకంపై నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మాతగా వ్యవహరించడంతోపాటు హీరోగా నటించిన చిత్రమే జయాభవ. ఈ సినిమాలో కల్యాణ్‌రామ్ ఒక డైలాగ్ చెబుతాడు. హీరోయిజమంటే అట్టే వచ్చేదికాదు, బ్లడ్‌లో వుండాలి... అది నాలో వుందని ఫిక్స్ అయ్యానంటాడు. కానీ జయాభవలో ఆయన పాత్రలో ఆ సత్తా ఎక్కడా కనబడదు. ఆయన మీద నమ్మకం లేక చిత్రం ప్రారంభంలోనే దానవీరశూరకర్ణలో 'జయాభవ' పాట పాడుకొంటూ మహానటుడు ఎన్టీఆర్ సాగే సన్నివేశాన్ని చూపిస్తాడు. అందాల హీరో



యిన్ హన్సికను ప్రతి పాటలో బోల్డ్‌గా చూపే యత్నం చేశాడు. హాంకాంగ్ అందాలు అక్కడి హబ్‌లను, తెరపై ఏదేదో అంకెల గారడీలు చూపిస్తూ చేసిన ప్రయత్నాలు ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేదు. ప్రధమార్ధమంతా బిల్లా స్టైల్‌ను అనుకరించిన నూతన దర్శకుడు నరేన్ కొండేపాటి ద్వితీయార్ధంలో రెడీ సినిమా బాణీలో సాగుతాడు. దీనికోసం బ్రహ్మానందం, హేమలకు ప్రత్యేక పాత్రలు సృష్టించాడు. ఈ చిత్రంలో మెచ్చుకోవాల్సిన వ్యక్తి కెమెరామెన్ దాశరధి శివేంద్ర. ఆయన విదేశీ అందాలను చక్కగా చూపాడు. సంగీత దర్శకుడు ధమన్ నెలలపాటు శ్రమించి స్వరపరచినట్లు పేర్కొంటున్న ఐదు పాటల్లో ఒక్క పాటా సినిమా చూస్తున్న ప్రేక్షకులకు అర్థమై చావదు. ఇంతమాత్రానికి ఆయన సంగీతం సమకూర్చడమెందుకో? కథతోపాటు మాటలు వ్రాసిన బివిఎస్ రవి కలం కూడా ఇంకిపోయిందేమో? ఈ సినిమాలో ఆయన వ్రాసిన గుర్తుంచుకో తగ్గమాట... ఎంత పెద్ద సముద్రమైనా సునామీ వస్తే చెల్లాచెదురే. ముఖేష్‌రుషి, జయప్రకాష్‌రెడ్డిల వంటి పెద్ద విలన్లను ఆయన కామెడీ యాక్టర్లుగా మలచిన తీరు ప్రేక్షకులు మెచ్చలేకపోతున్నారు. విజయ్ మాస్టర్ ఫైట్స్, నోబుల్ నృత్యాలు అంతంత మాత్రంగానే వున్నాయి. రఘుబాబు, వేణుమాధవ్, అలీ కామెడీ బాగుందనుకొంటున్న సమయంలో అలీకి మహిళ వేషం కట్టించి మందు కొట్టించి గబ్బు పట్టించాడు. బాగా ఖర్చు పెట్టించిన ఈ సినిమాను దర్శకుడు నరేన్ ఏవిధంగా తీయాలన్న విషయంలో అనుభవం లేక రీళ్లు చుట్టేయడంతో జనరంజకం కాలేదు.

చిత్రకథలోనికి వెళ్తే హైదరాబాద్‌లో రౌడీయిజం చేసి బతుకుతుండే భవానీశంకర్(ముఖేష్ రుషి), నరసింహం (జయప్రకాష్‌రెడ్డి)లను హాంకాంగ్ నుంచి యాదు(ఆశిష్ విద్యార్థి) నియంత్రిస్తుంటాడు. విదేశాల్లో చదువుకొంటుండే భవానీ శంకర్ కుమారుడే రామ్(కల్యాణ్‌రామ్). నరసింహం కుమార్తె అంజలి (హన్సిక). రామ్‌కు, అంజలికి విదేశంలో అయ్యే పరిచయం ప్రేమగా మారుతుంది. తాత(చలపతిరావు) ఫోన్ చేయడంతో ఇండియాకు వచ్చేస్తాడు రామ్. తండ్రిని ఇబ్బంది పెడుతున్న నరసింహంకు ఒక ఝలక్ ఇస్తాడు. హాంకాంగ్‌లో క్రికెట్ బెట్టింగులతో కోట్లు సంపాదిస్తుండే యాదు(ఆశిష్ విద్యార్థి)ని తెలివిగా బోల్తా కొట్టించి జైలుకు పంపిస్తాడు. వాస్తవానికి పూర్వాశ్రమంలో భవానీశంకర్, నరసింహం, యాదు ఓ ఫ్యాక్టరీలో కార్మికులు. మంచి స్నేహితులు. ఇక్కడ రేగే కలతలతో వారు ఎవరికివారై చీకటి దందాలతో ఎదిగిపోతారు. యాదు వల్లే తన తండ్రికి, నరసింహంకు మధ్య కలతలు పెరిగాయని, పాత స్నేహితులను కలపాలన్న నిశ్చయానికి రామ్ వస్తాడు. అంజలితో కలసి నాటకం ఆడను మొదలు పెడతాడు. అంజలి, భవానీ శంకర్ ఇంటికి వచ్చి తన అన్న బాలు(అలీ) వేధిస్తున్నాడని చెప్పి ఆశ్రయం పొందుతుంది. నరసింహం బావమర్ది పాండు(రఘుబాబు) సహకారంతో రామ్ ఆ ఇంట్లో ప్రవేశిస్తాడు. అక్కడ అంజలి, ఇక్కడ రామ్ భవానీశంకర్, నరసింహంల మనసు దోచుకొని వాళ్లే స్వయంగా వీరి పెళ్లి చేస్తామనేవరకు వెళ్లేలా చేస్తారు. చివరలో యాదు ఇండియా వచ్చి పాత స్నేహితుల మధ్య చిచ్చుపెట్టాలనుకొన్నా భవానీశంకర్, నరసింహంలలో పాత స్మృతుల తాలుకు భావాలు ఉప్పొంగడంతో ఇద్దరూ కలసి యాదుకు బుద్ధిచెప్పి అంజలి, రామ్‌ను ఒకటి చేయడంతో ఈ చిత్రం ముగుస్తుంది.

అతనొక్కడే, హరేరామ్ చిత్రాలతో పోల్చుకుంటే జయాభవలో కల్యాణ్‌రామ్ నటన బలహీనం. హన్సిక అందాల బొమ్మగా తప్ప నటనలో రాణించడం లేదు. నరసింహశాస్త్రిగా బ్రహ్మానందం తన పాత్రను బాగా పోషించాడు. హేమ పోషించిన గయ్యాళి పాత్ర అంతే. మిగతా వాళ్ల గూర్చి చెప్పుకోవాల్సింది ఏమీలేదు.

సడింపనని చెప్పలేదే!



తెలుగు చిత్రం కూపరలో హీరోయిన్‌గా నటించి ఆయేషా టకియాకు ఇక్కడ తగినంత గుర్తింపు రాలేదు. దీంతో ఆమె బాలీవుడ్‌లో హీరోయిన్‌గా స్థిరపడిపోయి గత ఏడాది ఫర్హాన్ అనే యువకుడిని పెళ్లి చేసుకొంది. పెళ్లి తర్వాత హిందీలో తెలుగు చిత్రం పోకిరి ఆధారంగా తయారైన వాంటెడ్‌లో నటించింది. ఈ చిత్రం బాక్సాఫీసు హిట్ కావడంతో ఆయేషా టకియాను అందరూ తమ చిత్రాల్లో నటించమని అడుగుతున్నారు. ఈ విషయమై ఆయేషా మాట్లాడుతూ అసలు నేను పెళ్లి తర్వాత సినిమాలు చేయనని ఎపుడు చెప్పాను? ఎక్కడ చెప్పాను? పెళ్లి అయినా నేను సినిమాల్లో నటించడం మా ఆయనకు ఎటువంటి అభ్యంతరం లేదు. రేవతి దర్శకత్వంలో నేను నటిస్తున్న తదుపరి చిత్రంలో మహానటి జయాబచ్చన్ కుమార్తెగా కనపడనున్నానంది.

దేహప్రదర్శనకే పరిమితం



దేవదాసు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఇలియానా దేహప్రదర్శనతో యువతను ఆకట్టుకొంది. ఆతర్వాత పోకిరిలోనూ ఇదే తరహాలో కొనసాగింది. ఖతర్నాక్‌లో గబ్బుగబ్బుగా కనపడి ఇమేజ్ డామేజ్ చేసుకొంది. రాఖీలో పరవాలేదనిపించినా, మున్నా, అట సినిమాల్లో మళ్లీ పాతబాటలోనే పయనించింది. జల్సాలో ఓ మోస్తరుగా నటించిన ఆమె కిక్‌లో పాటలకే పరిమితమయ్యింది. రెచ్చిపో చిత్రం ఇలియానా అందాల ప్రదర్శన కోసం తీశారనాలి. ఈ కోవలోనే ఇలియానాకు ఆఫర్లు వస్తున్నాయి. విష్ణు సరసన సలీంలో, ఎన్టీఆర్ సరసన మెహర్ రమేష్ తీస్తున్న చిత్రంలో నటిస్తున్న ఇలియానా దేహప్రదర్శనను నమ్ముకోకుండా నటనపై దృష్టిపెడితే పరిశ్రమలో మరికొంత కాలం వెలుగొందవచ్చన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. మరి దీనికి ఈ అమ్మడు ఏమంటుందో?

అంతా దయే




ఆస్కార్ అవార్డు సాధించిన తొలి భారతీయ సంగీత దర్శకునిగా రికార్డును స్వంతం చేసుకొన్న ఎ.ఆర్.రెహమాన్ ఇటీవల హైదరాబాద్ వచ్చారు. వరద బాధితుల సహాయార్థం సంగీత కచ్చేరి నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆస్కార్ అవార్డు ఓ మెట్టు మాత్రమే. దాన్ని ఆసరాగా చేసుకొని మరికొన్ని మెట్లు ఎక్కొచ్చంతే. స్లమ్ డాగ్... అనే సినిమాకు మాత్రమే వచ్చిన పురస్కారమది. ఆ సినిమా అయిపోయింది. ప్రతిసారీ మనల్ని మనం నిరూపించుకోవాలి. నామటుకు నేను ప్రతి అడుగూ జాగ్రత్తగా వేశాను. తెలుగులో దర్శకుడు కె.విశ్వనాధ్ చిత్రానికి స్వరాలు అందించాలన్నది నా కోరిక. అది ఎప్పటికి నెరవేరుతుందో. నా జీవితంలో ప్రతి ఎదుగుదలకు అల్లా దయే కారణమని ఈ స్వరమాంత్రికుడు వినమ్రంగా చెప్పాడు.

డ్యాన్స్ అంటే ప్రాణం!



తెలుగు చిత్రాల్లో ఎక్కువగా కనిపించే ఐటెం భామ ముమైత్‌ఖాన్ 'విల్లు' సినిమా షూటింగ్‌లో పిచ్చాపాటీగా మాట్లాడింది. నాకు తెలిసిన తారకమంత్రం డ్యాన్స్. ప్రపంచంలో నాకు నచ్చిన మూడు అంశాల గూర్చి ఎవరైనా ప్రస్తావిస్తే మొదటిది డ్యాన్స్. రెండవది డ్యాన్స్. మూడవది డ్యాన్స్ అనే చెబుతాను. నేను చదువుకొన్నది పదవ తరగతే. ఇవాళ నేను బయట కనిపిస్తే నలుగురు గుర్తు పట్టగలుగుతున్నారంటే కారణం నృత్యం. నా కెరీర్ గ్రూప్ డ్యాన్సర్‌గా మొదలయ్యింది. ఆ రోజుల్ని ఎప్పటికీ మర్చిపోను. ఒక్కో మెట్టూ ఎక్కడం అంత తేలిక కాదు. నా జీవితంలోని ప్రతి మలుపూ తేలిగ్గా వచ్చింది కాదు. నా శ్రమకు ఫలితమని చెప్పుకొచ్చింది.



నెల్లూరు వేణుగోపాలస్వామి దేవస్థానం ఛైర్మన్ తుమ్మల సుబ్బారెడ్డి కుమారుడు సుమన్‌తేజ, అనూషల వివాహం 23తేది సైదాపురం మండలం కృష్ణారెడ్డిపల్లె గ్రామంలో జరిగింది.

ఫ్రీ లెఫ్ట్ అమలు కాదా?



నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసినా ట్రాఫిక్ గాడిలో పడకపోగా మరింత జటిలమవుతోంది. అటు ట్రాఫిక్ పోలీసులకు, ఇటు ప్రజలకు ట్రాఫిక్‌రూల్స్‌పై తగిన అవగాహన లేకపోవడంతో సిగ్నల్స్ ఏర్పాటు చేసివున్నా వాహనచోదకులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఏ ప్రాంతంలోనైనా సిగ్నల్స్ వున్నచోట రెడ్‌లైట్ పడినప్పుడు వాహనాలు ఆగుతాయి. అయితే ఎడమవైపు వెళ్లేందుకు మాత్రం ఎలాంటి నిబంధనలు లేవు. 'ఫ్రీ లెఫ్ట్' విధానాన్ని అమలు చేయాల్సివున్నా పోలీసులు వాటిని గూర్చి పట్టించుకోకపోవడం, వాహనాలు వెళ్లేందుకు అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టడంలో తగిన విధంగా వ్యవహరించక పోవడంతో పేరుకు ఎడమవైపు వెళ్లేందుకుగాను ప్రత్యేకంగా డివైడర్లు ఏర్పాటు చేసినా ఫ్రీ లెఫ్ట్ అమలు కావడం లేదు. దీంతో ఎడమవైపు వెళ్లాల్సిన వాహనాలు సైతం సిగ్నల్ పడినప్పుడు నిలిచిపోవాల్సి వస్తుండడంతో వాహనాలపై వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యను చక్కదిద్దాల్సిందిపోయి చోద్యం చూస్తుండడంతో ప్రయాణీకులకు అగచాట్లు తప్పడం లేదు.

● పోలీసులకు సవాలుగా

జాక్‌పాట్ లారీలు



పోలీసులు పట్టుకొన్న జాక్‌పాట్ లారీలు (ఫైల్‌ఫోటో)

నెల్లూరును కేంద్రంగా చేసుకొని తమిళనాడుకు అక్రమంగా బియ్యం, పప్పులు, ఇతర సామగ్రిని తీసుకెళ్లే జాక్‌పాట్ లారీలు పోలీసులకు సవాల్‌గా నిలిచాయి. నగర కాంగ్రెస్ పార్టీలోని వివిధాల మూలంగా నెల్లూరు నుంచి చెన్నైకు బియ్యం లోడుతో వెళ్తుండిన 26 లారీలను డిఎస్పీ రాధికారెడ్డి సీజ్ చేశారు. బియ్యం స్మగ్లర్లకు రాజకీయ పెద్దలతో కమీషన్ సంబంధాలు వున్నాయి. దీనివల్ల ఇంత ఆగం జరిగాక కూడా జాక్‌పాట్ లారీలు మళ్లీ చెన్నైకు పోవడం మొదలుపెట్టాయి. జాక్‌పాట్ లారీల నిర్వాహకులు తమ బోలికి వస్తే ఉద్యోగాలకే ముప్పు తప్పదని పోలీసు అధికారులను సైతం బెదిరించారంటే వీరెంత ముదిరిపోయారో అర్థం చేసుకోవచ్చు. జాక్‌పాట్ లారీలు వెళ్తున్న విషయమై డిఎస్పీ రాధికారెడ్డి, సిఐ వీరాంజనేయరెడ్డికి ప్రతినిత్యం ఫోన్లు వస్తున్నా వీరు గతానుభవాల దృష్ట్యా వినీవిననట్లుగా వుంటున్నారు. 25తేది ఐదవనెంబర్ జాతీయ రహదారిపై రెండు మూడు గంటల పాటు నిలబడిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎటువంటి కాగితాలు లేకుండా సాగిపోతుండిన 24 ఐరన్ ఓర్, ఇసుక లారీలను పట్టుకొన్నారు. వీరి వద్ద నుంచి ఎనిమిది లక్షల రూపాయలు పరిహారంగా వసూలు చేశారు. బియ్యం, ఇతర సరకులతో బయలుదేరే లారీలకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ముందస్తు ఒప్పందాలు వుండడంతో 25తేది వీరు ఈ లారీల జోలికి వెళ్లనట్లు తెలిసింది. ఏదిఏమైనా సంఘ విద్రోహులు నడిపే జాక్‌పాట్ లారీలను పట్టే ధైర్యం చేయని పోలీసు, రెవిన్యూ, పౌర సరఫరాలు, వాణిజ్య పన్నుల శాఖల అధికారులను ఏమనాలో అర్థం కావడం లేదు.

తెలిసినా తెలియనట్లు నటిస్తున్నారు

పాత గుడ్డలు కొంటున్నారు... వేసుకొంటున్నారు!



కొంగొత్త రకాల దుస్తులను, వెరైటీ ఫ్యాషన్లను వేసుకొనేందుకు ప్రతి ఒక్కరూ ఉత్సుకత చూపుతుంటారు. తమకు నచ్చిన విధంగా రంగు రంగుల గుడ్డలను, తమ ఇష్టానికి తగినట్లు పలురకాల డిజైన్లతో కూడినవి వేసుకోవడం అనేది నేటి ఫ్యాషన్. ఫంక్షన్లు, పండుగల నాడే కాకుండా హుందాతనాన్ని చాటుకొనేందుకు, డాబు, దర్పం ప్రదర్శించేందుకు వస్త్రాలను ప్రత్యేకంగా రూపొందించుకొని వాడడం చూస్తుంటాం. పేద, మధ్యతరగతి వర్గాలవారు ఉన్నత వర్గాల ప్రజలు తమ స్థాయికి తగ్గట్లు గుడ్డలను కొనుగోలు చేస్తుంటారు. ఎప్పటికప్పుడు ట్రెండ్‌కు తగినట్లు ఫ్యాషన్లను ఫాలో అవుతూ అలాంటి దుస్తులను ధరిస్తుంటారు. ఇవన్నీ ఒక ఎత్తయితే పాత బట్టల వ్యాపారం అనేది మరొక అంశం. పేదరికం కోరల్లో చిక్కుకొని అలమటించే కుటుంబాల వారికి మాత్రం వాడేసిన గుడ్డలు ఆధారం అవుతున్నాయంటే ఎంతగా వారు పేదరికంలో మగ్గుతున్నది తెలుస్తుంది. పాతగుడ్డల వ్యాపారం మెల్లమెల్లగా నగరంలో విస్తరిస్తోంది అంటే అది ఎంతగా ఆర్థికంగా బలహీనమైన ప్రజలకు దగ్గరయ్యిందో అవగతం అవుతుంది. పలువురు వాడేసిన దుస్తులను స్టీలుసామాన్ల వ్యాపారులు, ఇతరులు తక్కువ ధరలకు తీసుకొని వాటిని తిరిగి శుభ్రపరచి కొత్తవాటిలా తయారుచేసి మార్కెట్‌లో అమ్మకానికి పెడుతున్నారు. అధిక ధరలు పెట్టి కొత్తవస్త్రాలను కొనుగోలు చేయలేని వారికి ఈ పాత గుడ్డలు అందుబాటులో వుండడంతో వీటిని కొనుగోలు చేసి ధరించేందుకు మొగ్గు చూపుతుండడంతో పాత గుడ్డల



నెల్లూరు నగరంలో ఈ వ్యాపారం బాగానే వుందంటే ఇంకా ఎందరు బిదరికంలో వున్నారో అర్థం చేసుకోవచ్చు.

అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. గతంలో ఎక్కడో ఒకటి రెండు ప్రాంతాల్లో అమ్మేవారు. నేడు వీటినే ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌లపై, బండ్ల మీద పెట్టి అమ్మడంతోపాటు ఆదివారాలు, సెలవుదినాల్లో విస్తృతంగా పాతగుడ్డల అమ్మకాలు సాగిస్తున్నారు వ్యాపారులు. చిన్నపిల్లల గుడ్డల దగ్గర్నుంచి మహిళలకు, పురుషులకు అందరికీ అన్ని వయసుల వారికి తగిన వస్త్రాలు దొరుకుతుండడంతో పలువురు పాతగుడ్డలను కొనుగోలు చేసేందుకు వస్తుండడంతో వాటి అమ్మకాల ద్వారా లాభాలు బాగానే వున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మామూలు వస్త్రాలకు వివిధ షాపులు, ప్రత్యేకంగా మాల్స్ వున్నట్లే పాత గుడ్డల వ్యాపారాన్ని సెలవుదినాల్లో నగరంలో పరికించినట్లయితే ఎంతమేర వాటి అమ్మకాలు సాగుతున్నది అర్థమవుతోంది.

● ఆర్‌అండ్‌బిలో

అసాంఘిక కార్యక్రమాలు



నెల్లూరు దర్గామిట్టలోని రోడ్లు భవనాలశాఖకు సంబంధించిన అతిథి గృహం చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారింది. చోటామోటా రాజకీయ నాయకులు, కొందరు అధికారులు సైతం అమ్మాయిలను తీసుకొచ్చి వ్యభిచారం జరుపుతున్నారు. కొద్దిరోజుల కిందట ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వేగంగా ఈ అతిథి గృహానికి చేరుకొన్న పోలీసులకు ఈ రూములు పెద్దల పేరుతో బుక్‌చేసి వుండడంతో లేనిపోని ఇబ్బందులు ఎందుకని వెనక్కు వెళ్లిపోయినట్లు తెలిసింది. ఎమ్మీలు, ఎమ్మెల్యేల పేర్ల మీద చోటాలు రూములు బుక్‌చేసి రాత్రి పగలు తేడా లేకుండా ఇక్కడ మద్యం సేవిస్తున్నారు, పేకాట ఆడుతున్నారు. అతిథి గృహాల్లోని రూములు ఎమ్మీలు, ఎమ్మెల్యేల పేరిట బుక్‌చేసి చోటాలు వాడుకొనేందుకు అధికారులు ఎందుకు అనుమతిస్తున్నారో అర్థం కావడం లేదు. పొట్టకూటికి వ్యభిచారం చేసే జారిణులను అరెస్టు చేయడంలో పోలీసులు చూపే వుత్సాహాన్ని ఆర్‌అండ్‌బిలో చేసే వారిపట్ల చూపిస్తే జనం మెచ్చుతారు.

బొల్లినేని ఆస్పత్రి

16వ పేజీ కొరవ

ఫంగస్ చాలా ప్రమాదకర సూక్ష్మక్రిమి. కంటిలోని సున్నితమైన నరాలు, కండరాలకు ఇది సోకితే, క్షణాలలో మెదడుకు చేరి, ప్రాణానికే అపాయం తెస్తుంది. కంటిలోపల ఒకసారి ఫంగస్ ఇన్‌ఫెక్షన్ సోకితే, ఇకదాన్ని నిర్మూలించడం కష్టసాధ్యం. అందువల్లనే మద్రాసు శంకర నేత్రాలయ డాక్టర్లు ఇన్‌ఫెక్షన్ సోకిన రోగులు కంటి గుడ్లను, కనురెప్పలను తొలగించి, ప్రాణాలు కాపాడారు.

రంగంలో రామనారాయణ

మన సమాజంలో పేద ప్రాణానికి ఎంత హీనమైన విలువ వుందో వికృతంగా ప్రదర్శించింది ఈ దుర్ఘటన. 16 మంది నిరుపేదలకు కంటి చూపు పోయిందన్న వార్త బయటకు రాగానే జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రంగంలోకి దిగారు. ఆ పేదలకు ఆపన్న హస్తం అందించడానికి కాదు, అందుకు కారకులైన ఆస్పత్రి నిర్వాహకులను రక్షించడానికి. కంటి చూపు పోయిన వారికి ప్రభుత్వం తరపున 50వేల రూపాయలు, ఆస్పత్రి తరపున ఒకటిన్నర లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించి, ఇంత ఘోరమైన పాపాన్ని కడిగి వేయడానికి ప్రయత్నం చేశాడు రామనారాయణరెడ్డి. దీనికి కారణం ఏమిటి, కారకులు ఎవరు, భవిష్యత్తులో ఇది పునరావృతం కాకుండా ఏమి చేయాలి, ఆ పేదలకు కంటి చూపు తెప్పించే అవకాశం ఏదైనా వుందా వంటి విమర్శకు ఆస్కారం లేకుండా చేయాలని చూశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ వంటి అధికారులు కూడా మంత్రి గారి మాటకు వంతపాడారు. అయితే టివి ఛానళ్లలో ఈ వార్తలు చూసి, చలించిపోయిన ముఖ్యమంత్రి రోశయ్య దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించడంతో కొంత కదలిక వచ్చింది. లేకుంటే ఇది అప్పటికప్పుడే సమాధి అయిపోయేది. ముఖ్యమంత్రి ఆదేశం మీద హైదరాబాద్ సరోజినిదేవి కంటి ఆస్పత్రికి చెందిన నిపుణులు నెల్లూరు వచ్చి, బొల్లినేని ఆస్పత్రి సందర్శించి, వివరాలు సేకరించారు. కంటి చూపు కోల్పోయిన రోగులను పరీక్షించారు. వారి ప్రాథమిక అభిప్రాయం కూడా ఆపరేషన్‌కు వాడిన పరికరాలు, మందులలో నాణ్యతా లోపమే అని తెలుస్తున్నది.

ఆస్పత్రి నిర్లక్ష్యం లేదట!

ఆస్పతి పెట్టిన తర్వాత 40వేల ఆపరేషన్లు చేశామని, ఇందులో డాక్టర్ల నిర్లక్ష్యం ఎంత మాత్రం లేదని, ఎక్కడో తమకు తెలియకుండా జరిగిన చిన్న పొరపాటు వల్ల ఈ అనర్థం దాపురించిందని బొల్లినేని కంటి ఆస్పత్రి ప్రధాన వైద్యుడు సాయి మురళి చెప్తున్నాడు. ఇటువంటి దుర్ఘటనలలో డాక్టర్ల తప్పు వుంటుందని నిందించలేము. ఎంత డబ్బు కక్కుర్తిగాళ్లయిన కంటిచూపుకు ఎసరు పెట్టేంత దుర్మార్గంగా, మానవత్వం లేకుండా ప్రవర్తిస్తారని భావించలేము. అయితే ఆస్పత్రి నిర్వహణలోని లోపాలు, పొదుపు చర్యలలో భాగంగా చవకబారు మందులు, వస్తువులు వాడడం; ఒకసారి వాడి పారేయవల్సిన పరికరాలను మళ్లీ మళ్లీ వాడడం, శుభ్రతా చర్యలు పాటించకపోవడం వంటి వాటి వల్ల రోగుల ప్రాణాలు తరచు ప్రమాదంలో పడుతున్నాయి. ఈ రకం కక్కుర్తి పనులు సహించరానివి. తమ లాభం కోసం రోగుల ప్రాణాలు ప్రమాదంలో పెట్టే అధికారం ఆస్పత్రి యాజమాన్యాలకు లేదు. వారా నేరం చేస్తే, అందుకు తగిన శిక్ష అనుభవించక తప్పదు.

ఆస్పత్రిపై మరో నింద

ఇంత ఘోరం జరిగి, జాతీయస్థాయిలో సంచలనం రేగిన తర్వాత కూడా ఇదే ఆస్పత్రి మరొక నీచమైన నిందకు గురైంది. కసుమూరుకు చెందిన పెంచలయ్య అనే వ్యక్తి పురుగుల మందు త్రాగడంతో రామచంద్రారెడ్డి ఆస్పత్రిలో చేర్పించారట. పరిస్థితి విషమించడంతో వెంటిలేటర్ సౌకర్యం కోసం బొల్లినేనికి తరలించారు. ఐసియులో అతనికి మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని, లోపలకు ఎవరిని అనుమతించమని చెప్పి, దాదాపు లక్ష రూపాయల బిల్లు చేశారట ఆస్పత్రి డాక్టర్లు. అయితే వారి మాటలపై అనుమానం వచ్చిన అతడి బంధువులు దౌర్జన్యంగా ఐసియులోకి వెళ్లి చూసేసరికి పెంచలయ్య చచ్చి శవంగా మారి వున్నాడు. శవానికి వైద్యం పేరిట డబ్బు గుంజుతున్నారని వారు గొడవకు దిగడంతో, ఎట్లానో సర్దిచెప్పి, పంపేశారు.

కార్పొరేట్ ఆస్పత్రులు రోగుల పాలిట యమకింకరుల వలె తయారయ్యాయన్న అభిప్రాయం ప్రజలలో బలంగా వేళ్లూనుకొని వుంది. ఇటువంటి నీచపు సంఘటనలు, దుర్ఘటనలు దాన్ని మరింత దృవపరుస్తున్నాయి. ఇంత ఘోరం జరిగిన తర్వాత అయినా ఆస్పత్రి నిర్వాహకులలో కనీసపాటి మానవత్వం మొలకెత్తుతుందని ఆశించడం తప్ప మనం చేయగల్గింది ఏదీ లేదు.

జనవాణి

2వ పేజీ కొరవ

చారం ఏమీ లేదు. ఇంత దారుణంగా సిబ్బంది పనిచేస్తుంటే పున్నతాధికారులు చూస్తూ ఊరుకొంటే ఎలా?

డాక్టర్ కాళిదాసు పురుషోత్తం, నెల్లూరు

శాంభవిని కాపాడండి!

బౌద్ధమత గురువు దలైలామా శిష్యురాలంటూ ఏడేళ్ల బాలిక శాంభవికి మీడియా విపరీతమైన ప్రచారం ఇస్తోంది. ఆమె శక్తిస్వరూపిణి అని, అద్భుతశక్తులు వున్నాయని మూర్ఖభక్తులు కొందరు ఆ పాప పాదాలపై పడి ఆమె భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. బంగారు భవిష్యత్తు వున్న ఆమెను కొందరు స్వార్థానికి వాడుకొంటున్నా శిశు సంక్షేమ అధికారులు, పోలీసు చూస్తూ ఊరుకోవడం దారుణం. మీడియా ప్రశ్నించినప్పుడు కొన్ని ప్రశ్నలకే ఆమె జవాబులిస్తున్న విషయం గ్రహించకుంటే ఎట్లా?

సోలా జానకీదేవి, నెల్లూరు

సిఎంకు కృతజ్ఞతలు

రాష్ట్ర ప్రభుత్వ వుద్యోగులకు, పెన్షనర్లకు కరవు భత్యాన్ని 8.47 శాతం పెంచినందుకు ముఖ్యమంత్రి డాక్టర్ కొణిజేటి రోశయ్యకు కృతజ్ఞతలు. వరదలు సంభవించి వుండడంతో కరవు భత్యం పెంచరనే నిర్ణయానికి వచ్చి వుండినాం. ఈ సమయంలో దీపావళి కానుకగా ప్రభుత్వ వుద్యోగులకు, పెన్షనర్లకు కరవు భత్యం మంజూరు చేశారు. అదే విధంగా పి.ఆర్.సి. సిఫార్సులు కూడా ఆమోదించమనవి.

నీలిశెట్టి చిన్నయ్యగుప్తా, నెల్లూరు

జేజేలు

మొన్న వచ్చిన శతాధిక వరదలు ఘోర కలిని సృష్టించాయి. మనము కట్టుకున్న శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజి లాంటి ప్రాజెక్టులు మహానుభావుడు నెహ్రూ గారు చెప్పినట్లు నిజమైన దేవాలయాలు దెబ్బతినకుండా చెక్కు చెదరకుండా నిలిచాయంటే వాటి నిర్మాణంలో పాలు పంచుకున్న ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, వాటి రాజకీయ నాయకులు ఎంతో సంస్మరణీయులు. ఆ నిర్మాణాల్లో ఒకటైన నాగార్జున సాగర్ పనిలో నెల్లూరు కాంట్రాక్టర్లు గునుపాటి రామచంద్రారెడ్డి, గునుపాటి వెంకటకృష్ణారెడ్డి తదితరులు. ఇంజనీర్ జి.కె.రెడ్డి పర్యవేక్షణలో కాంట్రాక్టు పనిని నాణ్యంగా చేయబట్టే ఈ రోజు అది అంతపెద్ద వరదను తట్టుకొని నిలబడింది. వారికి జేజేలు పలుకుతున్నాను.

తూపిలి వనమాలి, హైదరాబాద్

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

అవార్డును నవంబర్ 1తేది ఇందిరాభవన్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో విఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి ప్రదానం చేస్తారు. రాష్ట్రంలో వరదల కారణంగా ఈ అవార్డు ప్రదానోత్సవం గతంలో వాయిదావేశారు.

కొండెక్కిన కూరగాయలు

ధరలు రోజురోజుకు పెరుగుతున్న బియ్యం, పప్పుల సరసన కూరగాయలు చేరాయి. ఈ మధ్య ఎప్పుడూలేనట్లుగా బీన్స్, క్యారెట్, పందిరి చిక్కుళ్లు కిలో 40 రూపాయలు అమ్ముతున్నాయి. నెల్లూరు వంకాయలు 30 రూపాయలు, బంగాళాదుంపలు 25రూపాయలు, బెండకాయలు 25 రూపాయలు, చామగడ్డలు 20 రూపాయలు, క్యాలీఫ్లవర్, సీమవంకాయలు కూడా 20 రూపాయలు అమ్ముతుండగా టమోటా ధర మాత్రం 10 రూపాయలు వద్ద స్థిరపడి వుంది. ఆకుకూరలు, మునగకాయలు, పొట్లకాయలు కూడా రేటు పెంచి అమ్ముతుండడంతో సామాన్య, మధ్యతర గతి ప్రజలు ఈ ధరలు చెల్లించి కూరగాయలు కొనలేక విలవిల లాడిపోతున్నారు.

పొర్లుకట్టల మరమ్మత్తులు చేయండి

సోమశిల, కండలేరు, కనిగిరి రిజర్వాయర్లలో పూర్తిస్థాయి నీటి నిల్వ వుండడం వల్ల జిల్లాలో మళ్లీ వర్షాలుపడితే వరద వచ్చే ప్రమాదం వున్నందున పొర్లుకట్టలకు తక్షణం మరమ్మత్తులు చేయించాలని మాజీ శాసనసభ్యుడు జక్కా వెంకయ్య, జిల్లా కలెక్టర్ రాంగోపాల్‌ను కలసి కోరారు. పెన్నకు వరద వస్తే ఆత్మకూరు మండలంలోని బండారుపల్లి, వాశిలి, అప్పారావుపాళెం, పీర్లగుడిపాడు గ్రామాల్లోకి నీళ్లు వస్తాయని, వీరాపేరు, బొగ్గేరు పొంగితే పరిస్థితి క్లిష్టంగా తయారవుతుందన్నారు. పెన్నానది సముద్రంలో కలిసే ఊటుకూరులో రెండు వైపులా కట్టలు దెబ్బతిని వున్నాయని జక్కావెంకయ్య జిల్లా నీటి పారుదల వ్యవహారంపై తనకున్న అపార అనుభవాన్ని కలెక్టర్‌కు చెప్పారు.

ముస్లింల సామూహిక వివాహాలు

నెల్లూరు వక్ఫ్ బోర్డు నేతృత్వంలో పేద ముస్లిం యువతీ, యువకులకు సామూహిక ఉచిత వివాహాలు నవంబర్ 5తేదీ కస్తూరిబా కళాక్షేత్రంలో జరుగుతాయి. పెళ్లిళ్లు చేసుకొనే జంటలకు డబుల్‌కాట్ మంచం, పరుపు, దిండ్లు, స్టీల్ సామాన్లు, ఖురాన్ ప్రతితోపాటు వారి తరపున 50 మంది బంధువులకు బిర్యానీ పెట్టన్నట్లు వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు ఎస్ఎఎం హుస్సేనీ చెప్పారు.

సండేమార్కెట్ రజతోత్సవాలు

నెల్లూరులో రోడ్ మార్టిన్‌లో వ్యాపారం చేసేవారితో సెంట్రల్‌బ్యాంక్ వెనుక ఏర్పాటైన సండేమార్కెట్ స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రజతోత్సవ సంబరాలు 25తేదీ ఘనంగా జరిపారు. వీటిలో రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఝాన్సీ, సహాయ కార్యదర్శి జె.కిశోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మరణం

నెల్లూరు విఆర్‌కాలేజి రిటైర్డ్ పొలిటిక్స్ లెక్చరర్ పులిమి శ్రీరాములురెడ్డి (75) 19తేదీ కోవూరులోని తన స్వగృహంలో మరణించారు. రిటైర్ అయ్యాక రాజకీయ పాఠాలు మాని హాలికునిగా మారారాయన. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుటుంబ పెద్దను కోల్పోయిన వీరి కుటుంబానికి మా సానుభూతి.

సితార బార్

16వ పేజీ కొరవ


శాలిచ్చారు. అయితే వివేకానందరెడ్డి మాత్రం తన ప్రయత్నాలు మానలేదు. ముఖ్యమంత్రి ఆదేశం వార్త బయటకు పొక్కగానే, ఆఘమేఘాల మీద తిరుపతి మీదుగా గగన మార్గంలో హైదరాబాద్ ప్రయాణం కట్టాడు. ఎక్సైజ్ అధికారుల మీద తన తమ్ముడు ఆనం రామనారాయణరెడ్డి ద్వారా తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నాడు. భానుశ్రీ మనసు కష్టపెట్టుకొంటే ఆయన తట్టుకోలేడు కదా?

రాజకీయవాదులు చేయడానికి చాలా వ్యాపారాలున్నాయి. కనపడిన ప్రతి వ్యాపారంలో వేలు పెడుతూనే వున్నారు. కోట్లు కోట్లు దోచుకొంటున్నారు. గత నాలుగేళ్లలో భానుశ్రీ ఆస్తులు 100 కోట్ల రూపాయు దాటాయని రాజీవ్‌భవన్ నిర్వాహకులు ఇప్పటికే ఒక నివేదిక తయారుచేసి, ఎసిబికి ఫిర్యాదు చేస్తున్నారు. ఆమె ధన దురాశకు పందకోట్ల పరిమితి కూడా చాలక పోవడం నెల్లూరు ప్రజలు చేసుకొన్న దురదృష్టం. తన వ్యాపార లాభం కోసం పవిత్రమైన దేవస్థానాలకు కూడా అపచారం చేయడానికి సాహసిస్తున్నారామె. ఆ రాజరాజేశ్వరి దేవి స్వయంగా పూనుకొంటే తప్ప ఈ దుర్మార్గాలకు తెరపడేట్లు లేదు.

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు

టెన్త్ పరీక్షల్లో గ్రేడింగ్‌పై భిన్నాభిప్రాయాలు!

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఇప్పటి వరకు వున్న మార్కుల విధానానికి స్వస్తి చెప్పి సిబిఎస్ఇ తరహాలో గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు రాష్ట్రప్రభుత్వం నడుం బిగించింది. ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మాణిక్య వరప్రసాద్, కార్యదర్శి సురేష్, కమిషనర్ పూనం మాలకొండయ్య తదితరులు సమావేశమై గ్రేడింగ్ విధానాన్ని 2010 విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు నిర్ణయం తీసుకొన్నారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ప్రభుత్వం ప్రకటిస్తోంది. ఒత్తిడి తగ్గడం మాట ఎలా వున్నా కార్పొరేట్ రంగంలో స్కూళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి విద్యను వ్యాపార మయం చేసి ర్యాంకుల ప్రకటనలను ఆర్భాటం చేస్తున్న ఈ రోజుల్లో గ్రేడింగ్ ద్వారా వాటిని అరికట్టవచ్చున్నది ప్రభుత్వ అభిప్రాయంగా తెలుస్తున్నది. గతంలోలా ర్యాంకులు, ఫస్ట్‌క్లాస్, సెకండ్ క్లాస్‌లు ఇక వుండవు. వాటి స్థానంలో ఎ, బి, సి, డి గ్రేడ్‌లు వుంటాయి. 12.5 శాతం మందిని ఒక గ్రేడ్‌గా లెక్కించి దాని ప్రకారం గ్రేడింగ్‌ను అమలు చేస్తారట. 591-506 మార్కులు సాధించిన వారిని ఎ1 గ్రేడుగా, 505-468 మార్కులు తెచ్చుకొన్న వారిని ఎ2, 476-434 మార్కులు వచ్చిన వారిని బి1, 432-404 మార్కులు వచ్చినట్లయితే బి2, 403-375 మార్కులు వచ్చిన వారిని సి1, 374-345 మార్కులు సాధించినట్లయితే సి2, 344-310 మార్కులు వచ్చిన వారిని డి1, 309-304 మార్కులు తెచ్చుకొన్న వారిని డి2 గ్రేడ్‌గా విభజిస్తారు. ప్రతి సబ్జెక్టులో 35 మార్కుల కంటే తక్కువ వచ్చిన విద్యార్థిని ఫెయిలైనట్లుగా పరిగణించి గ్రేడ్-ఇగా చెప్తారట. మార్కుల జాబితా తీసుకోనంత వరకు విద్యార్థులకు ఎవరి మార్కులు ఎంతెంత అనేవి తెలియవని, ఒకవేళ వ్యక్తిగతంగా తెలుసుకోవాలనుకొంటే ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవిఆర్ఎస్) ద్వారా సాధ్యమవుతుందని ప్రాథమిక విద్యామంత్రి ప్రకటించారు. ప్రభుత్వం క్రొత్తగా ప్రవేశపెట్టిన గ్రేడింగ్ విధానంపై పలువురు ఉపాధ్యాయ సంఘనాయకులు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఈ విధంగా వున్నాయి.



కేంద్రమే వద్దనుకొంది



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సిబిఎస్ఇ విధానాన్ని చూసి రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ పదవతరగతిలో గ్రేడింగ్ విధానానికి జీవో జారీ చేయడం సరైంది కాదు. గ్రేడింగ్ విధానం సరిగాలేదని భావించి కేంద్రం దానిలో మార్పులు చేయాలనుకొంటున్న సమయంలో ఇక్కడ ఆ విధానం ప్రవేశపెట్టడం అవివేకం. 12.5 శాతం క్రింద గ్రేడింగ్ పెట్టడం వలన కొద్ది తేడాతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం వున్నందున దీనికి బదులుగా పర్సంటేజి విధానాన్ని అమలు చేయాలి.

- వెంకటేశ్వరరావు, ఎపిటిఎఫ్

సరైన విధానం కాదు



సిబిఎస్ఇలో అమలు చేస్తున్న గ్రేడింగ్ విధానాన్ని మనకు అమలు చేయాలనుకోవడంలో లోటుపాట్లు వున్నాయి. రాష్ట్రంలో గ్రేడింగ్ అమలు చేసినా ప్రశ్న పత్రాలు రూపకల్పన, దిద్దడంలో మార్పు లుండవని చెప్పడం కరెక్టు కాదు. సిబిఎస్ఇలో 5 పేపర్లు వుంటాయి. మనకు 11 పేపర్లు, సిలబస్ ఎక్కువ. ఈ పరిస్థితులలో సిబిఎస్ఇని చూసి గ్రేడింగ్ అనడం తల్లిదండ్రులను, విద్యార్థులను ప్రక్కదారి పట్టించడానికే పెడుతున్నారు. దీని వలన ఎస్ఎస్సి బోర్డు ప్రమాదంలో పడనుంది.

పి.బాబురెడ్డి, యుటిఎఫ్ రాష్ట్రకార్యదర్శి

మంచి విధానం



పదవతరగతి పరీక్షా ఫలితాల్లో గ్రేడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడం మంచి విధానం. దీని వలన ర్యాంకుల విధానం పోయి విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుంది. కార్పొరేట్ విద్యాసంస్థలు బోగస్ ర్యాంకులను ప్రకటించుకోవడం వుండదు. విద్యార్థులు సబ్జెక్టులపై శ్రద్ధ పెరగడానికి కారణం అవుతుంది. అటు తల్లిదండ్రులకు, ఇటు విద్యార్థులకు ఎంతో మేలైన విధానం.

- ఎ.పి.బాలాజీ, కరస్పాండెంట్

డాక్టర్ సలహా — శుభ్రంగా వుంటే స్వైన్‌ఫ్లూ రాదు!

రాష్ట్రాన్ని వణికిస్తున్న స్వైన్‌ఫ్లూ జిల్లాకు వ్యాపించింది. కావలికి చెందిన ఉపాధ్యాయుడు ఈ వ్యాధితో చనిపోవడంతో జిల్లాలో తొలి స్వైన్‌ఫ్లూ మరణం రికార్డయింది. పలువురు ఈ వ్యాధి లక్షణాలతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రజలను వణికిస్తున్న స్వైన్‌ఫ్లూ పట్ల కొంత జాగ్రత్తపడ్డట్లయితే భయాందోళనలు చెందనవసరం లేదని చెప్తున్నారు నెల్లూరు నగరంలోని ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్. స్వైన్ ఫ్లూ వలన ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. హెచ్1, ఎన్1 వైరస్ వలన వచ్చే వ్యాధి ఇది. మొదటగా మెక్సికోలో బయటపడింది ఈ స్వైన్‌ఫ్లూ. వాస్తవానికి 1916, 1960ల్లోనే రెండుసార్లు ఈవ్యాధి వచ్చి తగ్గిపోయింది. అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫోర్డ్ దీనికి సంబంధించిన వ్యాక్సిన్‌ను వేసుకొన్నారు. కొందరు ఆ వ్యాక్సిన్ వేసుకొన్నా చనిపోయేటప్పటికి అది వికటించిందని భావించి దానిని నిలిపివేశారు. స్వైన్‌ఫ్లూను పంది జ్వరం అని అంటారు. చల్లని ప్రదేశాలలో ఇది త్వరితంగా వ్యాప్తి చెందుతుంది. వేడి ప్రాంతాలలో ఈ వైరస్ చనిపోతుంది కాబట్టి మన ప్రాంతంలో ఇది ప్రబలే అవకాశం తక్కువ. జలుబు, గొంతునొప్పి, తలనొప్పి, విరోచనాలు, దగ్గు ఈవ్యాధి లక్షణాలు. అయితే జలుబు, దగ్గు వున్నంత మాత్రాన స్వైన్ ఫ్లూగా భయపడనవసరం లేదు. ఊపిరి పీల్చడం కష్టంగా వుండడం, ఆయాసం, దొక్కులు ఎగురవేయడం దీని లక్షణాలు. ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందే గుణం ఈ వ్యాధికి వుండడం వలన ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులు శుభ్రంగా వుంచుకోవడం ముఖ్యం. ఎవరైనా తుమ్మినా, దగ్గినా ఆ తుంపరులు గాలిలో వ్యాపించి ఇతరులకు సోకుతాయి. అవిపడిన వస్తువులను తాకినా, ఆప్రాంతంలో వున్నా వాటిని పట్టుకొని చేతులు ముఖంపై పెట్టుకొన్నా, వెంటనే వస్తుంది కాబట్టి చేతులు శుభ్రంగా వుంచుకోవడం ఉత్తమం. ప్రతిఒక్కరూ చేతులను సబ్బు, డెట్టాల్‌తో శుభ్రపరుచుకోవాలి ఆ వైరస్ 8 గంటలపాటు బ్రతికి వుంటుంది కాబట్టి. పలువురు సర్జరీకి ఉపయోగించే మాస్క్‌లను కట్టుకొంటున్నారు. దీనివలన ఎలాంటి ఉపయోగం ఉండకపోగా వచ్చే అనర్థం ఎక్కువ. దుమ్ము, ధూళి మాస్క్‌లకు అంటుకోవడంతోపాటు వాటిని టేబుళ్లు ఇతరప్రాంతాల్లో వుంచడం వలన నిమోనియా సోకే ప్రమాదం వుంది. దీనికి ఎన్95 మాస్క్‌లు వాడాలి. కాని అవి ఖర్చుతో కూడుకొన్నందున చేతి రూమాలును ముక్కుకు కట్టుకోవడం ఉత్తమం. వీటిని ప్రతిరోజు శుభ్రపరుచుకొన్నట్లయితే చాలు. రద్దీగా వుండే సినిమా హాళ్లు, హోటళ్లకు వెళ్లకపోవడం మంచిది.



డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్
ఫిజీషియన్ - నెల్లూరు.

• బొల్లినేని ఆస్పత్రి ధన దాహమే

అంతమందిని కబోధులను చేసింది!

నెల్లూరు బొల్లినేని కంటి ఆస్పత్రిలో ఆపరేషన్ల సమయంలో వాడిన పరికరాలు, మందులు, ద్రావకాలు అన్నీ నాసిరకమైనవే. 16 మంది నిర్భాగ్యుల కంటి చూపు ధనదాహంతో కూడిన నిర్లక్ష్యం మూలంగా పోయిందంటే క్షమించి వదిలేద్దామా?



శస్త్ర చికిత్సలు వికటించి వార్తల్లో నిలిచిన బొల్లినేని హాస్పిటల్.

వైద్యులు శ్రీమన్నారాయణుడితో సమానం. ఆస్పత్రి పవిత్ర దేవాలయం. లక్షలలో బిల్లు కట్టే పేషంట్ కూడా ఆస్పత్రి బయటకు వచ్చేటప్పుడు ఫలానా డాక్టర్ దేముడిలాగా తన ప్రాణం కాపాడాడని చెప్తాడే తప్ప, డబ్బిచ్చి ఆయుష్షు కొన్నానని చెప్పడు. అయితే వైద్య సేవల పట్ల ప్రజలలో వున్న ఈ పవిత్ర భావన, డాక్టర్లలో కనుమరుగై పోతున్నది. డబ్బు యావ తప్ప, మానవత్వం మృగ్యమై పోతున్నది. కార్పొరేట్ ఆస్పత్రుల సంస్కృతి వచ్చిన తర్వాత ఈ ధనార్జన ధోరణి మరింత వెర్రితలలు వేస్తున్నది. దాని దుష్ఫలితమే - 16 మంది నిర్భాగ్యులు కంటిచూపు కోల్పోవడం.

మరుసటిరోజే సమస్యలు

నెల్లూరులోని బొల్లినేని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి అనుబంధంగా నడిచే గ్లోబల్ ఐ ఫౌండేషన్ ఈ పాపాన్ని మూట కట్టుకొన్నది. ఇందుకూరుపేట మండలం గంగపట్నం, నెల్లూరు నగర శివారులోని శ్రామికనగర్‌లలో వీరు ఉచిత నేత్ర చికిత్సా శిబిరం నిర్వహించారు. అందులో 36 మంది పేదలకు కంటి శుక్లాల శస్త్ర చికిత్స అవసరమని తేల్చారు. వీరందరికీ బొల్లినేని ఆస్పత్రిలో ఆపరేషన్లు చేశారు. కానీ ఆ ప్రక్కరోజే వీరిలో సగం మందికి సమస్యలు తలెత్తాయి. వారిని చూడగానే ఆస్పత్రి డాక్టర్లకు గుండె ఠారెత్తింది. వారి కళ్లు ఫంగస్ ఇన్‌ఫెక్షన్‌తో కుళ్లి పోవడం గమనించి, అత్యవసర చికిత్స కోసం మద్రాసు, విజయవాడలకు తరలించారు. అయితే అప్పటికే ఆలస్యం జరిగిపోయింది. వీరిలో నలుగురికి కంటి గుడ్డు తొలగించక తప్పలేదు. మరొక 12 మంది ఇంచుమించు అదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అదృష్టం బాగుండి కంటి గుడ్డు తొలగించే అవసరం ఏర్పడకపోయినా, వీరంతా ఇక శాశ్వతంగా అంధుల క్రిందే లెక్క

కారణాలేమిటి?

ఇందరి జీవితాలు వున్నట్టుండి చీకటి మయం కావడానికి కారణం - ఆపరేషన్ సమయంలో వాడిన పరికరాలు, మందులు, ద్రావకాల నాణ్యతా లోపం. పేదలలో అంధత్వ నివారణకు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ ఆస్పత్రులకు ఆర్థికసహాయం చేస్తుంది. దాన్ని రాబట్టుకోవడం కోసం, ఉచిత వైద్యశిబిరాల పేరిట ప్రజలను మోసం చేస్తున్నారు డాక్టర్లు. కంటి శుక్లాల చికిత్సకు కంటిలోపల అత్యంత సున్నితమైన లెన్స్ అమర్చాలి. పేరున్న కంపెనీలు అన్నిరకాల నాణ్యతా ప్రమాణాలు పాటించి వాడే లెన్స్‌కు ప్రత్యామ్నాయంగా పంజాబ్ రాష్ట్రంలోని కొన్ని సంస్థలు డూప్లికేట్ లెన్స్‌లు తయారు చేస్తున్నాయి. అసలు లెన్స్ ఖరీదు వంద రూపాయలనుకొంటే ఈ పంజాబ్ లెన్స్ నాలుగైదు రూపాయలకే దొరుకుతుంది. కార్పొరేట్ ఆస్పత్రులు రోగులను మభ్యపెట్టి, ఈ నకిలీ లెన్స్‌లను వాడడం అలవాటై పోయింది. లెన్స్‌లను ఒక రకం ద్రావకంలో ముంచి, నిల్వచేయాలి. అయితే ఎప్పటికప్పుడు ద్రావకాన్ని మారిస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని భావించి, మళ్లీ మళ్లీ దాన్నే వాడుతున్నారట. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఈ ద్రావకంలో ఫంగస్ ఏర్పడే అవకాశం వుంది.



శస్త్ర చికిత్సలు చేయించుకొని కళ్లు పోగొట్టుకొన్న నిర్భాగ్యులు.

మరొకప్రక్క నర్సులు వాడే చేతి గ్లౌజ్‌లను ప్రతి పేషంట్‌కు మార్చు చేయాలి. కానీ పొదుపు పాటించే ఆస్పత్రి యాజమాన్యాలు ఒక రోజంతా ఎన్ని ఆపరేషన్లు చేసినా ఒకే జత గ్లౌజ్‌తో పని పూర్తి చేస్తున్నారు. దీనితో ఒక రోగి కంట్లో ఏదైనా ఇన్‌ఫెక్షన్ వుంటే, గ్లౌజ్‌ల ద్వారా అది అందరు రోగులకు వ్యాపిస్తున్నది. ఆపరేషన్‌కు ముందు కన్ను శుభ్రం చేయడానికి వాడే రింగర్‌లాక్టేట్ అనే ద్రావణం విషయంలో కూడా నాణ్యత పాటించకపోవడం వల్ల ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయి. దీనిలో కూడా ఫంగస్ పుట్టే అవకాశం వుంది.

కొరవ 14వ పేజీలో

సితార బార్ ప్రారంభాన్ని ఆపిన సిఎం!

- ఆఘమేఘాల మీద రాజధానికి పయనమైన వివేకా.
- రామనారాయణ ద్వారా ఎక్సైజ్ ఉన్నతాధికారులపై ప్రారంభానికి తీవ్ర ఒత్తిడి.

శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానం పక్కన బారు పెట్టుకోవాలని నెల్లూరు మేయర్ భానుశ్రీ గత నాలుగు నెలలుగా చేస్తున్న ప్రయత్నాలకు మరొకసారి బ్రేక్ పడింది. నగరంలో చాలా బ్రాండీ షాపులలో భానుశ్రీకి భాగస్వామ్యం వుంది. నెల్లూరు నగరంలో ఎవరు కొత్తగా బ్రాండీ షాపు పెట్టాలనుకొన్న భానుశ్రీకి పదిశాతం ఉచిత వాటా ఇచ్చి తీరాల్సిందే అని ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి ఒత్తిడి చేస్తుండడం వల్ల, దాదాపుగా అందరూ ఆ ఆదేశాన్ని పాటించక తప్పడం లేదు. బ్రాండీషాపు పెట్టుకోవడానికి మునిసిపల్ అధికారుల అనుమతి తప్పనిసరి కావడంతో, ఎమ్మెల్యే ఒత్తిడికి లొంగనివారు ఆ వ్యాపారం వదలి వెళ్లిపోవాల్సి వస్తున్నది. ఈ ఉచిత భాగస్వామ్యాల వల్ల మేయర్‌గారికి నెలకు ఇరవై లక్షల రూపాయల వరకు రాబడి వచ్చి ఒళ్లో వాలుతున్నదని అంచనా. ఇంత దోపిడీ చేస్తున్నా ఆమె ఆశకు అంతు వుండడం లేదు.

రాజరాజేశ్వరి దేవస్థానం సమీపంలో బ్రాండీషాపులు లేవు కాబట్టి, అక్కడ ఒక బార్ పెడితే మంచి వ్యాపారం జరుగుతుందని భానుశ్రీకి ఎవరో సలహా ఇచ్చారట. రాణి తలచుకొంటే కానిదేముంటుంది? ఆమె బినామిగా కాంట్రాక్ట్ పనులు, ఇతర వ్యాపారాలు చేసే అమానుల్లాఖాన్ అనే వ్యక్తి పేరు మీద సితార బార్ లైసెన్స్ పొందారు. అయితే ఇది దేవస్థానం సమీపంలో వుండడం వల్ల వేల సంఖ్యలో వచ్చే మహిళా భక్తులకు అసౌకర్యమని భావించి స్థానిక కార్పొరేటర్లు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి దీనిపై అభ్యంతరం తెలిపారు. నెల్లూరు నగర కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన అనిల్‌కుమార్ యాదవ్, రాజీవ్‌భవన్ నిర్వాహకులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైవి.రామిరెడ్డి తదితరులు దీనిపై ఒక నిరసన ఉద్యమమే జరిపారు. దేవస్థానానికి వచ్చే మహిళా భక్తులు కూడా పెద్ద ఎత్తున అందులో పాలు పంచుకొన్నారు. మేయర్ దుశ్చర్యల పట్ల కోపగించుకొన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ బారు లైసెన్స్ రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. దానితో ఆ కథకు తాత్కాలికంగా బ్రేక్ పడింది.

అయితే వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణించగానే లైసెన్స్ ఫైల్‌కు మళ్లీ ప్రాణం పోశాడు ఎమ్మెల్యే వివేకానందరెడ్డి. అధికారులను బెదరించి, గుట్టు చప్పుడు కాకుండా అనుమతి తెచ్చాడు. అన్నీ సవ్యంగా జరిగి వుంటే మొన్న బుధవారం (28తేది) బారు తలుపులు తెరిచి



రాజరాజేశ్వరి దేవస్థానం వద్ద ప్రారంభానికి సిద్ధమైన సితార బార్.

వుండాలి. అయితే గుడి పక్కన బారు మళ్లీ పెడుతున్నారని తెలిసి మహిళా భక్తులు ఆందోళన వ్యక్తం చేయడంతో సర్వేపల్లి శాసనసభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రోశయ్యగారి దృష్టికి తీసుకెళ్లారు. దేవస్థానానికి అపచారం జరుగుతున్నదని తెలియగానే, దాన్ని తక్షణం నిలపమని అధికారులకు ఆదే

కొరవ 14వ పేజీలో

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.